Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 83 మేడ్చల్ మల్కాజ్‌గిరి 15 ఏప్రిల్ 2023 శనివారం పేజీలు : 4

### ముఖ్యమంత్రికి అగ్రి వర్సిటీ వీసీ నియామక అధికారం

చెన్నై : రాష్ట్రంలోని 13 విశ్వవిద్యాలయాలతో పాటు అంబేద్కర్ లా యూనివర్సిటీ ఉపకులపతులను నియమించే అధికారాన్ని ఇప్పటికే గవర్నర్‌కు తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా కోయంబత్తూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ నియామక అధికారాన్ని కూడా తొలగించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం అసెంబ్లీలో ప్రత్యేక ముసాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ముసాయిదాలో 1949 సంవత్సరం గుజరాత్ విశ్వవిద్యాలయ చట్టం, 1991 తెలంగాణ విశ్వవిద్యాలయ చట్టం యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించే అధికారం ముఖ్యమంత్రికి కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు.

# దేశమంతా దళిత బంధు ఇచ్చే రోజు వస్తుంది

## అంబేద్కర్ విగ్రహావిష్కరణ సభలో సీఎం కేసీఆర్

హైదరాబాద్: దేశమంతా ఏటా 25లక్షల కుటుంబాలకు దళితబంధు ఇచ్చే రోజు వస్తుందని భారాస అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేసిన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన మనువడు ప్రకాశ్ అంబేద్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. "అంబేద్కర్ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 70ఏళ్లు దాటింది. ఏటా అంబేద్కర్ జయంతిని నిర్వహిస్తున్నాం. కానీ, ఎస్సీలు మాత్రం అభివృద్ధి చెందలేదు. అంబేద్కర్ కలలు సాకారం కావాల్సిన అవసరం ఉంది. ఆయన సిద్ధాంతం విశ్వజనీనం, సార్వజనీనం. ఎవరో అడిగితే హైదరాబాద్ నడిబొడ్డున అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయలేదు. అంబేద్కర్ విశ్వమానవుడు. విశ్వమానవుడి విశ్వరూపం ప్రతిష్ఠించుకున్నాం. అంబేద్కర్ విగ్రహం సమీపంలోనే బుద్ధుడి విగ్రహం, అమర వీరుల స్మారకం ఉన్నాయి. సచివాలయానికి కూడా అంబేద్కర్ పేరు పెట్టుకున్నాం. ఇది విగ్రహం కాదు విప్లవం. అంబేద్కర్ పేరిట ఏటా అవార్డు ఇవ్వాలని కత్తి పద్మారావు సూచించారు. అవార్డు కోసం ప్రత్యేకంగా రూ.51 కోట్లతో నిధి ఏర్పాటు చేస్తాం. దానిపై ఏటా రూ.3కోట్ల వరకు వడ్డీ వస్తుంది. ఏటా అంబేద్కర్ జయంతి రోజున ఉత్తమ సేవలందించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవార్డు ప్రదానం చేస్తాం. తెలంగాణ కలలను సాకారం చేసుకునే చిహ్నం ఈ విగ్రహం. విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు.

**ప్రజలు గెలిచే రాజకీయం రావాలి..** "ప్రజలు గెలిచే రాజకీయం రావాలి. 2024 ఎన్నికల్లో రాబోయే ప్రభుత్వం మనదే. దేశంలో ఏటా 25 లక్షల దళిత కుంటుంబాలకు దళిత బంధు అమలు చేస్తాం. మహారాష్ట్రలో భారాసకు గొప్ప స్పందన వచ్చింది.

యూపీ, బిహార్‌లో కూడా స్పందన వస్తుంది. మహారాష్ట్ర తరహాలోనే దేశమంతా స్పందించే రోజు వస్తుంది. ఈ మాటలు కొందరికి మింగుడు పడక పోవచ్చు. రాష్ట్రంలో ఇప్పటిరకు 50వేల మందికి దళితబంధు అందింది. ఈ సంవత్సరం మరో 1.25 లక్షల మందికి దళితబంధు అమలు చేస్తాం. ఎస్సీల అభ్యున్నతి కోసం తెచ్చిన కార్యక్రమం దళితబంధు. వాస్తవ కార్యాచరణ దిశగా ఎస్సీ మేధావులు కదలాలి" అని సీఎం కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.





# రెండో రాజధానిగా హైదరాబాద్..

## అంబేద్కర్ ఆశయం నెరవేరలేదు: ప్రకాశ్ అంబేద్కర్



హైదరాబాద్: సమాజంలో మార్పుకోసం సంఘర్షణ తప్పదని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనువడు ప్రకాశ్ అంబేద్కర్ అన్నారు. హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రకాశ్ అంబేద్కర్ మాట్లాడారు. "అంబేద్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు. అంబేద్కర్ ఆదర్శాలు పాటించడమే నిజమైన నివాళి. సమాజంలో మార్పుకోసం అంబేద్కర్ భావజాలం ఎంతో అవసరం. దీనికోసం సంఘర్షణ తప్పదు. రూపాయి సమస్యపై 1923లోనే అంబేద్కర్ పరిశోధన పత్రం రాశారు. ఆంగ్లేయులు భారత్‌ను ఎలా దోచుకుంటున్నారో ఆయన గ్రహించారు.

రూపాయి బలోపేతం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఆర్థిక దుర్భలత్వంపై పోరాడేందుకు కేసీఆర్ కృషి చేస్తున్నారు. దళితబంధు పథకం రూపొందించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు. అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ ముందుకు తీసుకెళుతున్నారు. అంటరానితనాన్ని పారద్రోలడానికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారు. కొన్ని అతి చిన్న కులాలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు కోసం ఆనాడు పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగం చేశారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసే వరకు సమస్య పరిష్కారం కాలేదు. తెలంగాణ కోసం కూడా ఎంతో పోరాటం జరిగింది. చిన్న రాష్ట్రాల ప్రతిపాదనకు అంబేద్కర్ మద్దతిచ్చారు. దేశానికి రక్షణ సమస్య వస్తే మరో రాజధాని అవసరమని అంబేద్కర్ చెప్పారు. రెండో రాజధానిగా హైదరాబాద్ సరైందని సూచించారు. పాక్ , చైనా నుంచి హైదరాబాద్ ఎంతో దూరంలో ఉంది" అని ప్రకాశ్ అంబేద్కర్ వివరించారు.



## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. దళితుడిని సీఎం చేయాలి: కోమటిరెడ్డి

మంచిర్యాల: దళితులకు సీఎం కేసీఆర్ చేసిందేమీ లేదని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. మంచిర్యాలలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దళిత బంధు పథకం భారాస నేతలకు దోపిడీగా మారిందన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులకు అండగా ఉన్నట్టు కాదని, 16శాతం ఉన్న మాదిగలకు ఇప్పటికీ మంత్రి వర్గంలో ఎందుకు స్థానం కల్పించలేదని ప్రశ్నించారు. దళిత నాయకుడు ఖర్గేను తమ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నామని, కాంగ్రెస్‌లో అన్ని వర్గాలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీ నుంచి మహేశ్వర్‌రెడ్డి వెళ్లినా ఎలాంటి నష్టం లేదన్నారు. తాను కూడా పార్టీ వీడుతున్నట్టు ఎన్నోసార్లు ప్రచారం చేశారని, అయినా తాను పార్టీ మారలేదన్నారు. గిట్టనివాళ్లు దుష్ప్రచారం చేస్తుంటారని వ్యాఖ్యానించారు. 33 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నా.. పీసీసీ అధ్యక్ష పదవి రానంత మాత్రాన పార్టీ మారతానా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో నా పాదయాత్ర ఉండదు. భట్టి విక్రమార్క పాదయాత్రనే నా పాదయాత్ర. ఇవాళ ఖర్గేను అడుగుతాం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దళితుడిని సీఎం చేయాలని కోరతాం" అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.



## అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపెవరిది? ముఖ్యమంత్రి ఎవరు?

# దేశం దృష్టిని ఆకర్షిస్తున్న 'కర్నాటకం'

కర్ణాటక ఎన్నికలు దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. దక్షిణాదిలో బీజేపీ అధికారంలో ఉన్న ఏకైక రాష్ట్రం ఇదే. ఇక్కడ గెలవకపోతే ఇక దక్షిణాది మొత్తం మీద బీజేపీ చాపచుట్టేసినట్టే. అందుకే కర్ణాటకలో బీజేపీకి గెలుపు అత్యవసరం. ఇక్కడ ఓడిపోతే ఇక దక్షిణాదిలో బీజేపీకి గడ్డుకాలం తప్పదు. అందుకే కర్ణాటకలో అలివికానీ సంచలన హామీలు రిజర్వేషన్లు ఇచ్చి ముందుకెళుతోంది. దీంతో కర్ణాటకలో ఇప్పుడు గెలుపు ఎవరిది అన్నది ఉత్కంఠ రేపుతోంది. తాజాగా 'పీపుల్స్ పల్స్ రీసెర్చ్ ' నిర్వహించిన సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సర్వేలో కర్ణాటకలో మెజార్టీకి అవసరమైన 113 స్థానాలు ఈసారి ఏ పార్టీకి రావని తేలింది. మళ్లీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. దీంతో జేడీఎస్ ఇక్కడ కీలకంగా మారడం ఖాయమని అంటున్నారు. సర్వేలో అధికార బీజేపీ ప్రతిపక్ష కాంగ్రెస్ లు హెూరా హెూరీ పోరాడుతాయని తేలింది. కాంగ్రెస్ కే కొంత మెరుగు ఉంటుందని.. ఇక్కడ గెలువచ్చని చాలా సర్వేలు చెప్పాయి. భారత్ జోడో యాత్రతో కాంగ్రెస్ కు కర్ణాటకలో మంచి ఊపు వచ్చిందని.. ఈసారి మెజార్టీ సీట్లు గెలుస్తుందని అంటున్నారు. సర్వేలు కూడా కాంగ్రెస్ వైపే మొగ్గుచూపుతున్నాయి. పీపుల్స్ పల్స్ తాజాగా పీపీఎస్ పద్ధతిలో కర్ణాటకలోని 56 నియోజకవర్గాల్లో సర్వే నిర్వహించింది.

మొత్తం 5600 శాంపిల్స్ సేకరించింది. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో కొంత మొగ్గు ఉన్నట్టు సర్వేలో తేలింది. ఈ సర్వేలో కాంగ్రెస్ కు 98 సీట్లు సాధించి అతిపెద్ద పార్టీగా నిలుస్తుందని చెబుతున్నారు. దాదాపు 105 సీట్ల వరకూ రావచ్చని తేల్చారు. ఇక బీజేపీకి 92 స్థానాలు రావచ్చని అంటున్నారు. ఈ సర్వేను బట్టి చూస్తే హెూరాహెూరీ పోరు తప్పదని అంటున్నారు. ఇక జేడీఎస్ 27 సీట్లతో కింగ్ మేకర్ గా అవతరిస్తుందని సర్వే తేల్చింది. జేడీఎస్ కు 25-30 సీట్లు రావచ్చని ఆ పార్టీ ఎవరికి మద్దతు ఇస్తే వారిదే సీఎం పీఠం.. కర్ణాటకలో అధికారం పీపుల్స్ పల్స్ రీసెర్చ్ సర్వే తేల్చింది. 2018 ఫలితాలే ఇక్కడా పునరావృతం కావడం ఖాయమని అంటున్నారు.

## సంపాదకీయం

# కన్నడ నాట అమూల్ రచ్చ.. బీజేపీకి గుదిబండ?

దక్షిణాదికి చెందిన కర్ణాటక.. తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వారు.. తమ ప్రాంతం పట్ల.. తమ ఉనికి విషయంలో వారెంత పట్టుదలతో ఉంటారో తెలిసిందే. హిందీ మీద రచ్చ తమిళనాడులో ఎంతలా ఉంటుందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తమిళనాడుకు ఏ మాత్రం తీసిపోని రీతిలో కన్నడిగుల తీరు ఉంటుంది. చూసేందుకు.. మాట్లాడేందుకు చాలా సాఫ్ట్ గా కనిపిస్తారు కానీ.. లెక్క తేడా వస్తే కన్నడిగుల కోపాగ్నిని తట్టుకోవటం తమిళులకే సాధ్యం కాదని.. అంత మొండిగా ఉంటారని చెబుతారు. ఇప్పుడు ఆ రాష్ట్రంలో గుజరాత్ కు చెందిన అమూల్ సంస్థ వ్యవహారం ఇప్పుడు రచ్చగా మారింది. డెయిరీ ఉత్పత్తుల విషయానికి వస్తే అమూల్ కు దేశ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతులు ఉంటే.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'నందిని'కి ఉన్న ఇమేజ్ తక్కువేం కాదు. కీలకమైన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ పెరిగిన పాల పంచాయితీ చివరకు ఎక్కడి వరకు వెళుతుందన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. బెంగళూరులో ఆన్ లైన్ ద్వారా అమూల్ పాలు.. పెరుగును అమ్ముతామని అమూల్ ప్రకటించటంతో మొదలైన పంచాయితీతో పలు కన్నడ సంస్థలు సోమవారం నిరసనలు..ధర్నాలు చేపట్టాయి. అంతేకాదు గో బ్యాక్ అమూల్.. సేవ్ నందిని అంటూ సోషల్ మీడియాలోనూ ప్రచారం పెద్దదైంది. గుజరాత్ కు చెందిన అమూల్ ను రాష్ట్రానికి తీసుకొచ్చి కర్ణాటకకు చెందిన నందిని డెయిరీని దెబ్బ తీయాలని బీజేపీ భావిస్తుందని కాంగ్రెస్.. జేడీ(ఎస్)లు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఇప్పటికే తమ విజయబ్యాంక్ ను గుజరాత్ కు చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడా మింగేసిందని.. దేశంలోని నౌకాశ్రయాలు.. ఎయిర్ పోర్టులను గుజరాతీకి చెందిన అదానీకి కట్టబెడుతున్నారంటూ మండి పడుతున్నారు. కాంగ్రెస్ నేత సిద్దిరామయ్య.. జేడీఎస్ కు చెందిన కుమారస్వామితో సహా పలువురు నేతలు అమూల్ కు వ్యతిరేకంగా గళం విప్పుతున్నారు. సోషల్ మీడియాలో వారి వ్యాఖ్యలు వైరల్ గా మారుతున్నాయి. అయితే.. అమూల్ కర్ణాటకలోకి ఎంట్రీ ఇవ్వటం లేదని.. నందినీ డెయిరీని అమూల్ లో విలీనం చేస్తారన్నది ఉత్తమాటేనని బీజేపీ చెబుతోంది. ఇదంతా సెంటిమెంట్ ను రగిలించే కుట్రగా అభివర్ణిస్తున్నారు. ఇదిలా ఉంటే.. అసలీ వివాదం ఎక్కడ మొదలైందన్న విషయాన్ని వెతికితే.. కొద్ది నెలల క్రితం కేంద్ర మంత్రి అమిత్ షా నోటి నుంచి వచ్చిన మాటే ఈ పంచాయితీకి కారణమని చెప్పాలి. మాండ్యలో పర్యటించిన సందర్భంలో అమిత్ షా మాట్లాడుతూ.. అమూల్.. నందినికలిసి మూడేళ్లలో కర్ణాటకలోని ప్రతి గ్రామంలో ప్రాథమిక డెయిరీని ఏర్పాటు చేస్తాయని పేర్కొన్నారు. తాజాగా అమూల్ ఒక ట్వీట్ చేసింది. దాని సారాంశం ఏమంటే.. బెంగళూరుకు విస్తరిస్తున్నట్లుగా పేర్కొన్నంతనే నిరసనల హోరు షురు అయ్యింది. నందిని ధారదత్తం చేయటానికి బీజేపీ కుట్ర పన్నుతున్నట్లుగా పేర్కొన్నారు. ఈ పంచాయితీ పెరిగేకొద్దీ కన్నడిగుల తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సినట్లుగా పరిస్థితి మారుతుంది. అదే జరిగితే కీలకమైన ఎన్నికల వేళ కమలనాథులకు కరెంట్ షాక్ లాంటి తీర్పు రావటం ఖాయమంటున్నారు. అమూల్ తో రగిలే సెంటిమెంట్ మొత్తం ఎన్నికల స్వరూపాన్ని మార్చే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వ వ్యతిరేకత ఓటు విషయంలో బీజేపీ ఆందోళనకు గురవుతుంది. ఇలాంటి వేళ.. అమూల్ రచ్చ తమకు ఎక్కడ నష్టం వాటిల్లేలా చేస్తుందన్నది ఇప్పుడు ప్రశ్నగా మారింది. మరి.. నష్ట నివారణకు కమలనాథులు ప్రయత్నిస్తారా? లేదా? అన్నది చూడాలి.

# 'గిరి' గ్రామాల్లో నీటిఎద్దడి




ఉట్నూర్ : ఏజెన్సీ గిరిజన గ్రామాల ప్రజలకు యేటా తాగునీటి తంటాలు తప్పడం లేదు. అసలే వేసవి కాలం కావడంతో ఆదివాసీల కష్టాలు వర్ణణాతీతం. మండుటెండల్లో గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నా రు. చెంబెడు నీటి కోసం చెట్లు, గుట్టలు వెంబడి పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తు తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి పథకాలు నిర్మించిన గిరిజన గ్రామాలలో ప్రజల కు మంచినీటి ఇబ్బందులు తప్పడం లేదు. ముదిరిన ఎండలతో భూగర్భ జలాలు అడుగంటి పోతుండడంతో బోరుబావుల్లో సైతం నీరు తగ్గిపోతోంది. ఫలితంగా గిరిజన గ్రామాల ప్ర జలు మంచినీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. వట్టిపోతున్న పథకాలుగిరిజన గ్రామాలకు తాగునీరు సరఫరా చేయడానికి కుమ్రం భీం జిల్లా ఆడ ప్రాజెక్టు నుంచి వేసిన పైపు లైన్ ద్వారా ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలకు సరైన విధంగా మంచినీరు సరఫరా కావడం లేదు. ప్రతీ గ్రామంలో మిషన్ భగీరథ ట్యాంకులు నిర్మించి పైపు లైన్‌లు నిర్మించినప్పటికీ చాలా చోట్ల లీకేజీలు ఏ ర్పడి మంచినీటి పథకాలు వట్టిపోతున్నాయి. సోయినూర్ సమీపంలో నిర్మించిన పంపు ద్వారా సరైన విధంగా నీరు అందడం లేదు. తరచు లీకేజీలు ఏర్పడుతున్నాయని గ్రామీణులు పేర్కొంటున్నారు. ఉట్నూర్ మండలంలోని మారుమూల గ్రామాలైన శాంతాపూర్, రాజులమడుగు గ్రామాలు దట్టమైన అటవీ ప్రాంతం లో ఉన్నప్పటికీ గిరిజనులు వాగునీరుపై ఆధారపడుతున్నారు. రాజులమడుగు లో లక్షలాది రూపాయలతో నిర్మించిన మంచినీటి పథకం వెక్కిరిస్తోందని, చుక్క నీరు రావడం లేదని గ్రామంలో 25 కుటుంబా లు ఉన్నప్పటికీ రెండు బోరుబావులు వేసిన అధికారులు ఒక బోరుబావి చెడిపోయినా.. పట్టించుకోవడం లేదని గ్రామ పటేల్ ఆనంద్‌రావు తెలిపారు. ట్యాంకు నిర్మించి నాలుగేళ్లు గడుస్తున్న చుక్క నీరు రాలేదని వాపోతున్నా రు. శాంతాపూర్ గ్రామంలో 20 కుటుంబాలు ఉండగా, శాంతాపూర్ కొలాంగూడలో పది కుటుంబాలు జీవిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం ఈ గ్రామాల ప్రజలకు మంచినీరు అందించడానికి ఒక్కో గ్రామంలో రూ.లక్షలాది వెచ్చించి సోలార్ ట్యాంకుల ద్వారా నీరును అందించారు. అవి కాస్తా చెడిపోవడంతో ఆ గిరిజనులు బోరుబావులపై ఆధారపడ్డారు. కొలాంగూడలో ఉన్న ఒకే ఒక్కబోరులో కలుషిత నీరు వస్తోందని, గత్యంతరం లేక అవే తాగుతున్నామని గ్రామ పటేల్ సిడాం రాము తెలిపారు. 20 కుటుంబాలు ఉన్న శాంతాపూర్ గోండుగూడలో రెండు బోరుబావులు ఉన్నప్పటికీ.. ఒక్క బోరుబావిలోనే నీరు వస్తోందని, ఫలితంగా గ్రామస్థులు 2కి.మీ. దూరంలో ఉన్న వాగు వద్దకు వెళ్లి స్నానాలు, బట్టలు ఉతుకోవడం తప్పడం లేదని గ్రామ పటేల్ జూగాదిరావు ఆత్రం తెలిపారు. ఇదే కాకుండా ఘన్‌పూర్‌లో నూ తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎంపీపీ గ్రామమైనప్పటి కీ అధికారులు పూర్తిగా పనులు చేయడం లేదని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు వాపోయా రు. ఇప్పటికైనా తాగునీటి కష్టాలను తీర్చడానికి అధికారులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. నీటికష్టాలు తీరుస్తాం : : శ్రీనివాస్, డీఈఈ, ఉట్నూర్‌గిరిజన గ్రామాలలో తాగునీటి కష్టాలను తీర్చడానికి ప్రయత్నిస్తున్నాం. గత కొన్ని రోజులుగా ఆడ ప్రాజెక్టు నుంచి సాంకేతిక సమస్యలు రావడంతో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. బోరుబావుల మరమ్మతుల సర్పంచ్‌ల ద్వారా చేయిస్తున్నాం. మంచినీటి పథకాలకు చెందిన పైపు లైన్‌ల లీకేజీలను సత్వరంగా పూర్తి చేస్తాం.

తాగునీటి సమస్యను పరిష్కరించండి సారూ!ఐటీడీఏ కార్యాలయానికి ఎడ్లబండ్లపై తరలివచ్చిన ఆదివాసీలుఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని మండిపాటుకనీస సౌకర్యాలు సమకూర్చాలని పీవోకు చాప్రాల మత్తడి వాసుల విన్నపం ఉట్నూర్: తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చాప్రాల మత్తడి ఆదివాసీ గిరిజను లు ఎడ్లబండ్లతో తరలి వచ్చి ఐటీడీఏ పీవో క్యాంపు కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. సోమవారం ఐటీడీఏకు చేరుకున్న గిరిజనులు గత నెలలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సైతం తాము ధర్నా కు తలపడితే ఐటీడీఏ పీవో అంకిత్ తమ గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ హామీ అమలు కాలేదని, అందుకే ఈ రోజు ఎడ్లబండ్లతో తరలి వచ్చి ధర్నా నిర్వహిస్తున్నామ ని గిరిజనులు పేర్కొన్నారు. వేసవి కాలంతో పాటు ఇతర కాలాల్లో కూడ తాము తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నామని, ఇంటింటికీ ఎడ్లబండితో పాటు బ్యారెల్ ఏర్పాటు చేసుకున్నామని ఇప్పటికైన తమ తాగునీటి సమస్యను పరిష్కరించి గ్రామానికి రోడ్డు, అంగన్‌వాడీ స్కూల్ ఏర్పాటుచేయాలని, వాగుపై వంతెన నిర్మించాలని గిరిజనులు ఐటీడీఏ పీవోను వేడుకున్నారు. దీంతో పీవో స్పందిస్తూ.. ట్యాంకర్ ద్వారా తాగునీరు పంపించి మంచినీటి ఎద్దడి పరిష్కరిస్తామని, అదేవిధంగా మిషన్ భగీరథ పథకం ద్వారా సమస్య పరిష్కరిస్తామని పీవో హామీ ఇచ్చారు.

# ప్రత్యామ్నాయ పంటలపై సర్కారుగురి

నిర్మల్: గత కొన్ని సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న వరిపంటను పక్కన పెట్టి డిమాండ్ ఉన్న పత్తి, సోయాబీన్ పంటలసాగుకు ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల వ్యవసాయాధికారులు, రైతు సమన్వయ సమితి సభ్యులతో వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్ర కరణ్‌రెడ్డిలు వానకాలం పంటలసాగుపై సమీక్ష సమావేశం నిర్వహిచారు. అయితే మంత్రి ఇటు అధికారులతోనూ ముఖ్యంగా ఏఈఓలతోనూ సమావేశమై 2014కు ముందు ఆ తరువాత వ్యవసాయస్థితి గతులపైనా అలాగే పంటలసాగు రైతుల పరిస్థితులపైనా సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ రైతులను పెద్ద ఎత్తున ప్రోత్సాహిస్తోందన్నారు. పత్తిపంటకు ఈ సారి మద్దతు ధర కు మించి ధర పలికిందని, వేరుశనగ పంటకు కూడా రూ. 10 వేల వరకు ధర వచ్చిందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పత్తికి అంత ర్జాతీయ మార్కెట్‌లో భారీ డిమాండ్ ఉన్న కారణంగా ఆ పంటసాగుకు రైతులు సన్నద్ధం కావాలన్నారు. సోయాబీన్ పంటకు కూడా ధర ఎక్కువ గా ఉన్న కారణంగా ఆ పంటకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. పత్తి రైతులు లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దని, ప్యాకేజీ విత్తనాలను మాత్ర మే కొనాలని సూచించారు. నకిలీ విత్తనాల నిరోధానికి ప్రత్యేకటాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌ఈ కాటన్ విత్తనాలను వినియోగించవద్దని కోరారు. భూసారం తగ్గుతున్న కారణంగా రైతులు ఎక్కువగా ఎరువులు, రసాయనాలు వాడవద్దని వ్యవసాయాధికారుల సూచనల మేరకే వాటిని ఉపయోగించాలన్నారు. ఎకరానికి 40 కిలోలకు మించి యూరియాను వినియోగించవద్దని సూచించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగుచేయడం, పంటల దిగుబడి పెంచుకోవడంతోనే వ్యవసాయ లాభసాటి అవుతుందన్నారు. రైతులు మూసపద్దతిలో కాకుం డా ఇతర గ్రామాలు, మండలాలు, జిల్లాల్లో పర్యటించి అక్కడి ప్రత్యామ్నాయ పంటల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. దక్షిణ భారతదే?శంలో బియ్యం, కందిపప్పు తరువాత మినుములకు అత్యధిక డిమాండ్ ఉందని, వినియోగం కూడా ఎక్కువగా ఉన్నందున ఆ పంట సాగుకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పంటల మార్పిడిలో భాగంగా ఆయిల్ పాం పంటలసాగుకు చొరవ తీసుకోవాలని ఈ ఏడాదిలో రాష్ట్రంలో 2 లక్షల నుంచి 2.5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగును లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశంలో బైబ్యాక్ గ్యారంటీ ఉన్న ఏకైక పంట ఆయిల్ పాం మాత్రమేనని అందుకే ఈ పంటను ప్రోత్సాహిస్తున్నామన్నారు. భూమిలో భాస్వరం విపరీతంగా పెరిగిపోయిందని దీంతో దీనిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ జిల్లాల్లో భూమిలోపలి భాస్వరం కారణంగా పంటల దిగుబడులపై ప్రభావం చూపుతోందన్నారు. రాబోయే ఖరీఫ్ నుంచి పొద్దు తిరుగుడు విత్తనాలను కూడా సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో మినహా మిగతా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో వైవిధ్యమైన పంటలసాగు చేస్తున్నారని, నిర్మల్‌లో మాత్రం సాంప్రదాయ పంటలకే ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అన్ని వ్యవసాయ క్లస్టర్‌ల పరిధిలో రైతులకు పంటమార్పిడితో పాటు ఆధునిక వ్యవసాయ పద్దతులు, మా ర్కెటింగ్, పంటధరలు లాంటి శిక్షణ తరగతులు కొనసాగించాలని కోరా రు. రైతులు పంటమార్పుపై శ్రద్ద వహించాలని, అధికారులు సైతం రైతులను ఇటువైపు మరలించాలన్నారు. ఈ సారి పత్తి, సోయాబీన్, మిను ము పంటలను ప్రాధాన్యత పంటలుగా చేసుకొని సాగుకు ఉపక్రమించాలని కోరారు. సమస్యలను వినిపించిన ఎమ్మెల్యేలుపంటల సాగులో ఏర్పడుతున్న ఇబ్బందులను పలువురు ఎమ్మెల్యేలు , మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు. ముథోల్ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ పాం మేకనైజేషన్ కోసం సబ్సిడీ పెంచాలన్నారు. ముథోల్ వ్యవసాయ పరిశోధన క్షేత్రానికి చెందిన 40 ఎకరాల స్థలం నుంచి ఐదు ఎకరాల స్థలాన్ని 30 పడకల ఆసుపత్రి కోసం కేటాయించాలని విఠల్‌రెడ్డి కోరారు. అలాగే రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందిం చాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖాశ్యాం నాయక్ మాట్లాడుతూ ప్రస్తు తం సన్నరకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కోరారు. కొత్త మండలాల్లో గోదాంలను నిర్మించాలని ఆమె పేర్కొన్నారు. స్థానికంగా పంటలకు మార్కెట్ సౌకర్యం కల్పించేట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. బోథ్ ఎమ్మెల్యే బాపురావు కూడా పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఏఈఓలతో మంత్రి నిరంజన్ రెడ్డి ముఖాముఖికాగా జిల్లాలోని పలువురు ఏఈఓలతో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. నిర్మల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఏఈఓ, సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి ఏఈఓ, ఖానాపూర్ మండలం సత్తన్‌పెల్లి ఏఈఓ, బోథ్ మండలంలోని పాట్నాపూర్ ఏఈఓలతో మంత్రి చర్చించారు. 2014 సంవత్సరాని కన్నా ముందు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయరంగ స్థితి గతులపై ఏఈఓలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పంటలసాగు, రైతుల పరిస్థితులు, రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు,

అలాగే పంట కొనుగోలు, గిట్టుబాటు ధర, ఆధునిక పంటలసాగు, ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహకాలు లాంటి అంశాలపై మంత్రి ఏఈఓల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. పాక్‌పట్లలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీఫ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రాబోయే రోజుల్లో ఆయిల్‌పాం పంటను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. లాభదాయక పంటలసాగుపై ప్రత్యేకదృష్టి పెట్టి ఆ దిశగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో ఆయిల్‌పాం ప్యాక్టరీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సారంగాపూర్ మండలంలోని బీరవెల్లి గ్రామంలో ఆయిల్ పాం నర్సరీ కొనసాగుతోందని తెలిపారు. రైతులకు ఉచిత కరెంటు, పెట్టుబడి సహాయం అందిస్తున్నామన్నారు. రాబోయే వానకాలం పంటల కోసం వ్యవసాయశాఖ రూపొందించే ప్రణాళికలను రైతులు తప్పనిసరిగా పాటించాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు.

# పత్తాలేని పదవులు

కరీంనగర్ : ఉగాది తర్వాత నామినేటెడ్ పదవుల పందేరం జరుగుతుందని ఆశలు పెంచుకున్న టీఆర్‌ఎస్ నేతల్లో మళ్లీ నిరాశ, నిట్టూర్పులు వినిపిస్తున్నాయి. ఉగాది, శ్రీరామ నవమి పోయినా ఒకటి, అరా కార్పొరేషన్ల చైర్మన్ల నియామకం తప్ప పూర్తిస్థాయిలో పదవుల భర్తీకి శ్రీకారం చుట్టకపోవడంతో టీఆర్‌ఎస్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రంజాన్ తోఫాగా ముస్లిం మైనార్టీ నేతలకు వక్ఫ్ బోర్డు పదవుల నియామకాలను పూర్తి చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ తమకు ఆ యోగం ఎప్పుడు పట్టిస్తారోనని గులాబీ నేతలు ఎదురుచూస్తున్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న అన్ని కార్పొరేషన్ల చైర్మన్, డైరెక్టర్ పదవులను ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో భర్తీ చేయలేదు. ఈ పదవులను పంపిణీ చేసి ఉంటే ఇప్పటికీ రెండేసి సార్లు నియామకాలు జరిగి పలువురికి అవకాశం దక్కేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. పలు కార్పొరేషన్ల పదవులు కొందరు నేతలకు అప్పగించినా వారి పదవి కాలం కూడా పూర్తయిపోగా కొందరికి మాత్రమే మళ్లీ ఆ పదవులలో కొనసాగింపునకు ఉత్తర్వులు వచ్చాయి. పదవులు దక్కిన వారికి రెండేసిసార్లు అదృష్టం వరిస్తుంటే రానివారు ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులకే పరిమితం కావాల్సి వస్తున్నదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




తొలి విడతలో పలువురికి అవకాశం

ఉమ్మడి జిల్లా తెలంగాణ ఉద్యమకాలంలో ఉద్యమనేత కేసీఆర్‌కు వెన్నంటి ఉంటూ ప్రతి కీలక మలుపులోనూ క్రియాశీల పాత్ర వహించిన నేపథ్యంలో సీఎం ఈ జిల్లాను సెంటిమెంట్ జిల్లాగా భావిస్తారు. ఆ కారణంగానే తొలి విడతలో పలువురికి ఇక్కడ నుంచి పదవులు లభించాయి. వారి పదవీకాలం పూర్తయినా కొందరికి మాత్రమే మళ్లీ ఆయా పదవుల కొనసాగింపు ఉత్తర్వులు అందాయి. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీల కార్యకర్తలుగా, నాయకులుగా పనిచేస్తున్న వారెందరో అటు పార్టీ పదవులుగాని, ఇటు అధికార పదవులుగాని లభించక నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో మొదటి విడతలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఐడీసీ చైర్మన్‌గా ప్రస్తుత పెద్దపల్లి జిల్లాకు చెందిన ఈద శంకర్‌రెడ్డికి, టెక్నికల్ సర్వీసెస్ కార్పొరేషన్ చైర్మన్ అదే జిల్లాకు చెందిన రాకేష్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా కోలేటి దామోదర్‌కు అవకాశం కల్పించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన అక్బర్ హుస్సేన్‌కు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. జగిత్యాల జిల్లాకు చెందిన లోక బాపురెడ్డికి మార్క్‌ఫెడ్ చైర్మన్ పదవిని, అదే జిల్లాకు చెందిన రాజేశం గౌడ్‌కు ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని, బీఎస్ రాములుకు బీసీ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. కరీంనగర్ జిల్లాకే చెందిన వకుళభరణం కృష్ణమోహన్‌రావుకు బీసీ కమిషన్ సభ్యుడిగా పనిచేసే అవకాశం దక్కింది. టెస్కాబ్ చైర్మన్‌గా సిరిసిల్ల జిల్లాకు చెందిన కొండూరి రవీందర్‌రావును అదృష్టం వరించింది. వీరందరి పదవీకాలం పూర్తికాగా కోలేటి దామోదర్, కొండూరి రవీందర్‌రావుకు మళ్లీ ఆ యోగం పట్టింది.

కొందరికి రెండోసారి అవకాశం

వకుళాభరణం కృష్ణమోహన్‌రావుకు హుజూరాబాద్ ఉప ఎన్నికల సందర్భంగా బీసీ కమిషన్ చైర్మన్ పదవి దక్కింది. హుజూరాబాద్ ఉప ఎన్నిక సమయంలోనే ఆ ప్రాంత నేత బండ శ్రీనివాస్‌కు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఉప ఎన్నిక రాని పక్షంలో వీరిద్దరి కూడా ఆ పదవీయోగం అంత త్వరగా పట్టేది కాదనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో ఉన్నది. కరీంనగర్ జిల్లాకే చెందిన మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్‌గా రెండుసార్లు నియమితులై ఆ పదవిలో కొనసాగుతున్నారు. రెండో విడతలో జిల్లాకు చెందిన ఇర్ఫాన్‌కు మానవ హక్కుల సంఘం సభ్యుడిగా అవకాశం దక్కింది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధి నుంచి కోలేటి దామోదర్, బండ శ్రీనివాస్, ఇర్ఫాన్, వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, రాజేశంగౌడ్, కొండూరి రవీందర్‌రావు, రసమయి బాలకిషన్ మాత్రమే పదవుల్లో ఉన్నారు. మేధావి వర్గం నుంచి పదవులు కట్టబెట్టిన వారిలో ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బుద్ధవనం ప్రాజెక్టు డైరెక్టర్ మల్లేపల్లి లక్ష్మయ్య, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంట చక్రపాణి కూడా జిల్లాకు చెందినవారే. వీరిలో చక్రపాణి పదవీకాలం పూర్తికాగా కొత్త చైర్మన్ నియామకం కూడా జరిగింది. అల్లం నారాయణ, మల్లేపల్లి లక్ష్మయ్యను రెండోసారి కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చారు.

అవకాశం వస్తుందా.. రాదా..

రాష్ట్రస్థాయిలో 67 కార్పొరేషన్లు ఉండగా వాటన్నింటిలో వందల మందికి పదవులు కల్పించే అవకాశం ఉన్నా అధినేత ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై పార్టీ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 20కిపైగా కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినా డైరెక్టర్ పదవులు కట్టబెట్టకపోవడంతో పలువురికి అవకాశం లేకుండా పోతున్నది. ఉగాది తర్వాత మంచి రోజులు వస్తాయని ఎదురుచూస్తున్న వస్తున్న నేతలు రోజు రోజుకు ఆ అవకాశాలు కనిపించకపోవడం, రాజకీయాలు వేగంగా మారుతూ వస్తుండడంతో నియామకాలు జరగకముందే ఎన్నికలు వస్తాయా అని ఆందోళన చెందుతున్నారు. ఎనిమిదేళ్లుగా తాము ఎదురుచూస్తున్న పదవులు అందని ద్రాక్షలే అవుతాయా అని వారు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. మరి కొందరు మాత్రం మరో 18 నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో తప్పకుండా కార్పొరేషన్ల పదవులు భర్తీ చేస్తారు, ఈ దఫా తమకు అవకాశం దక్కుతుందనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇంకా ఎన్నేళ్లు..!

వరంగల్ : ఎళ్లు గడుస్తున్నా.. రెండు పడక గదుల ఇళు వచ్చేనా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొన్ని చోట్ల శిలాఫలకాలకే పరిమితమవ్వగా, మరికొన్ని చోట్ల పనులు నత్తనడకన సాగుతోన్నాయి. వరంగల్ తూర్పులోని పేదల కోసం దూపకుంట గ్రామ శివారులో రెండు పడకల ఇళ్ల నిర్మాణాలు ఏళ్ల తరబడి సాగుతునే ఉన్నాయి. తొలివిడతలో ప్రారంభించిన 600 నిర్మాణాలు ఆరేళ్లవుతున్నా.. పూర్తవ్వలేదు. రెండేళ్ల క్రితం రెండో విడతలో మరో 1400 ఇళ్ల నిర్మాణాలు మొదలు పెట్టగా స్లాబ్ దశలోనే ఉన్నాయి. వరంగల్ దేశాయిపేట లక్ష్మి మెగా టౌన్‌షిప్ సమీపంలో 250 నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు విడుదల ఆలస్యమవుతుండటంతో.. గుత్తేదారులు జాప్యం చేస్తున్నారని తెలిసింది.

దూపకుంటలో ఆలస్యం

2012-13లో ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇళ్ల స్థలాల పంపిణీకి దూపకుంట శివారులో సుమారు 10 ఎకరాలు ప్రభుత్వం కొనుగోలు చేసింది.

2016-17లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. తొలివిడతలో 600 ఇళ్లకు అనుమతులు వచ్చాయి. 2019-20లో మరో 1500 నిర్మాణాలు మొదలు పెట్టారు.

దూపకుంటలో సుమారు 2వేల మందికి, దేశాయిపేట లక్ష్మి మెగా టౌన్‌షిప్ వద్ద 250 ఇళ్లు అందుబాటులోకి రానున్నాయి. దూపకుంటలో నిర్మాణాలు నెమ్మదిగా సాగుతున్నాయి. అంతర్గత రోడ్లు వేయాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి వసతికి పైపులైన్లు తదితర మౌలిక



సదుపాయాల పనులు చేపట్టాల్సి ఉంది.

తూర్పులో పేదలు ఎక్కువ

వరంగల్ తూర్పులో 120 పైనే మురికివాడలుండగా, సుమారు 1.20 లక్షల కుటుంబాలు దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నాయి. కార్మికులు, దినసరి కూలీలు, హమాలీలు, చిరు వ్యాపారాలు చేసుకుంటారు. సుమారు 25-30వేల మందికి సొంతిళ్లు లేవు. 15 వేల మంది గుడిసెల్లో నివాసముంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు పడక గదుల ఇళ్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. సుమారు 20 వేలకు పైగానే దరఖాస్తులు వచ్చాయి. ఇళ్ల స్థలాల కోసం 15 వేల మందికిపైగా ఎదురు చూస్తున్నారు.

ముఖ్యమంత్రి చెప్పినా అమలు కాలేదు

ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో వరంగల్ నగరంలో పర్యటించారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో మూడు, నాలుగు రోజుల పాటు తిరిగారు. వరంగల్ ప్రాంతంలో లక్ష్మీపురం, కరీమాబాద్ సాకరాశికుంట, ఏకశిలానగర్ బస్తీల్లో పర్యటించారు. రెండు ప్రాంతాల్లో రెండు పడక గదుల ఇళ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఎనిమిదేళ్లవుతున్నా.. ఇంత వరకు సాకారం కాలేదు.

నాలుగేళ్లుగా వెక్కిరిస్తున్న శిలాఫలకం

నియోజకవర్గంలో ఏ ఒక్కరికి రెండు పడక గదుల ఇల్లు మంజూరు కాలేదు. ఇళ్లు నిర్మించేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రముఖ పారిశ్రామిక వేత్త దొడ్డా మోహన్‌రావును ఒప్పించి పేదల ఇళ్లకు, ప్రభుత్వ అవసరాల వినియోగానికి 20 ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేయించి రెవెన్యూశాఖకు అప్పగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే 2018లో నర్సంపేట పట్టణంలోని 1160 మందికి ఇళ్లు నిర్మించేందుకు రూ.3494.50 లక్షలు మంజూరు చేయించారు. మోహన్‌రావు కొనుగోలు చేసి ఇచ్చిన భూమిలో రెండెకరాలు కేటాయించి 2019 జులై 14న ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లుగా శిలాఫలకం దిష్టిబొమ్మలా వెక్కిరిస్తోంది. ప్రస్తుతం ఆ ఇళ్లకు కేటాయించిన స్థలంలో జిల్లా ప్రధాన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణం లేనట్టేనని పలువురు భావిస్తున్నారు. సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే వారికి రూ.3లక్షలు ఇస్తామని అధికార పార్టీ నాయకులు చెప్పడం కొసమెరుపు.

స్థల వివాదం తలెత్తడంతో..వర్ధన్నపేట మండలం చెన్నారం గ్రామంలో 2017లో అప్పటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇళ్లకు కేటాయించిన స్థలం విషయంలో స్థానికులకు అధికారులకు మధ్య వివాదం తలెత్తడంతో పనులు నిలిచిపోయాయి. అధికారులు ఇన్నేళ్లుగా సమస్యను పరిష్కరించకపోవడంతో.. స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్ధన్నపేట మండల పరిధిలో ఏ ఒక్క గ్రామంలో ఇళ్లను నిర్మించలేదు.

# అత్యాధునికం.. జిల్లెల్లలో వ్యవసాయ కళాశాల

సిరిసిల్ల : సర్వాంగ సుందరంగా, అధునాతన సౌకర్యాలతో జిల్లాలోని తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో నిర్మించిన వ్యవసాయ కళాశాలను ప్రారంభానికి సిద్ధం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా దీనిని నిర్మించారు. ఈ విశ్వవిద్యాలయానికి ఆరో వ్యవసాయ కళాశాలగా ఏర్పాటు చేశారు. 2018 ఆగస్టు 9న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. 35 ఎకరాల విస్తీర్ణంలో రూ. 69.30 కోట్ల వ్యయంతో నిర్మించారు. 16 ఎకరాల్లో జీ ప్లస్-2 పద్ధతిలో కళాశాల భవనం పూర్తి చేశారు. వసతి గృహాలను నిర్మించారు.

విద్యార్థుల కోసం..విద్యార్థినీ, విద్యార్థుల కోసం వేర్వేరుగా హాస్టళ్లను నిర్మించారు. 19 ఎకరాల్లో వ్యవసాయ పరిశోధన క్షేత్రం, ల్యాండ్ స్కేప్‌ను నిర్మించారు. అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాల, సెమినార్ రూములు, అధ్యాపకుల గదులు, అసోసియేట్ డీన్ ఛాంబర్, ఆధునిక గ్రంథాలయం ఏర్పాటు చేశారు.నాలుగు సంవత్సరాల కోర్సులు..జిల్లెల్ల వ్యవసాయ కళాశాలలో నాలుగు సంవత్సరాల వ్యవసాయ కోర్సులను బీఎస్సీ ఆనర్స్ విభాగంలో విద్యార్థులకు అందించనున్నారు. ప్రధానంగా వ్యవసాయంలో విద్యార్థులకు వారి సామర్థ్యాలను పెంపొందించడానికి నాణ్యమైన విద్య, శిక్షణను ఇవ్వనున్నారు. వ్యవస్థాపక సామర్థ్యాలతో రైతులు, పరిశ్రమల అవసరాలను తీర్చడంతోపాటు వ్యవసాయ పరిశోధన అభివృద్ధి దిశగా ప్రాథమిక పరిశోధనలను నిర్వహిస్తారు. వ్యవసాయ సమస్యల పరిష్కారం, వినూత్న పద్ధతుల విస్తరణలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ఈ కళాశాల ముఖ్య ఉద్దేశం.

# రెండు పడక గదుల ఇళ్లకు పడిగాపులు



జనగామ : రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య పథకాల్లో ఒకటైన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, అందజేత జిల్లాలో ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నట్లు కొనసాగుతోంది. పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసేందుకు చేపట్టిన పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లు గడుస్తున్నా జిల్లాలో అమలు తీరు అంతంత మాత్రంగా ఉంది. జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల పరిధిలో 2015-16, 2016-2017, రెండు విడతల్లో 4097 ఇళ్లను రూ.222.52 కోట్లతో నిర్మించడానికి ఆమోదం లభించింది. ఇప్పటివరకు అన్ని విధాల పూర్తయినవి కేవలం 1348 మాత్రమే. ఇంకా టెండరు దశ దాటనివి 887 ఉండటం గమనార్హం. కొన్ని చోట్ల కట్టినవి సైతం పంపిణి కాలేదు. జిల్లాలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం అమలు తీరుపై ఆధ్వర్యంలో పరిశీలించగా..

నిర్మాణ వ్యయం పెంపుతో...పథకం ప్రారంభమైనపుడు సిమెంటు, ఇసుక, ఇటుక, కూలీల ధరలను అనుసరించి గ్రామాల్లో ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం రూ.5.04 లక్షలు, పట్టణాల్లో రూ.5.30 లక్షలుగా నిర్ణయించారు. ప్రారంభం నుంచే జీఎస్టీ తదితర పన్నులు చెల్లించాల్సి వచ్చినా ధరలు పెంచడానికి ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో గుత్తేదారులు వెనకడుగు వేశారు. మంజూరైన ఇళ్లను పూర్తి చేయించేందుకు గత డిసెంబరులో ప్రత్యేక సమీక్ష జరిపిన ప్రభుత్వం గతంలో పూర్తయిన వాటిని, తుది దశలో ఉన్న వాటిని జనవరి 26లోపు పంపిణి చేయాలని ఆదేశించింది. ఇళ్లు పూర్తికాకపోయినా, లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలిచ్చింది. జిల్లాలో 70 శాతం ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. అనేక చోట్ల పంపిణి చేయని ఇళ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. కొన్ని చోట్ల గుత్తేదారులు లేకపోవడంతో లబ్ధిదారులే ఇళ్లు కట్టించుకుంటున్నారు.

బేరసారాల దోబూచులాట..

లబ్ధిదారుల ఎంపిక ప్రజాప్రతినిధులకు, అధికారులకు కత్తిమీద సాముగా మారింది. జనగామ నియోజకవర్గం అక్కరాజుపల్లిలో 30ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక కొలిక్కిరాలేదు. కొన్ని చోట్ల ఎమ్మెల్యేలు సూచించిన వారికే ఇస్తున్నారని ఆరోపణలున్నాయి. జనగామ పట్టణంలో 2వేల మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వార్డు సభల్లో ఎంపిక చేస్తామని, తేదీ ప్రకటించి వాయిదా వేశారు. చివరగా 862 మంది అర్హులని.. కాదు మరోసారి చూడాలి జాబితా ఖరారు కాలేదు..అంటూ దోబూచులాట ఆడుతున్నారు. స్థలం విలువ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో రూ.2 నుంచి రూ.4 లక్షలు ఇస్తే, డబుల్ ఇల్లు మీ సొంతం అంటూ బేరాలు నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏ ప్రచారాలను నమ్మొద్దని అర్హుల జాబితా ప్రజల ముందుంచి, లాటరీ ద్వారా ఎంపిక చేస్తారని, జిల్లా అధికారులు అంటున్నారు.

నిర్మించినా నిరుపయోగంగా...

బచ్చన్నపేట మండలంలోని ఇటుకాలపల్లి, బచ్చన్నపేట, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో రెండు పడకల గదుల ఇళ్లను పరిశీలించగా ఇటుకాలపల్లిలో గ్రామంలో రెండు పడకల 18 ఇళ్లు పూర్తయి ఏడాదైనా లబ్ధిదారులకు పంపిణీ కాలేదు. ఇక్కడ ఇళ్లలో పందులు, కుక్కలు, ఉంటున్నాయని గ్రామస్థులు తెలిపారు. నాగిరెడ్డిపల్లిలో 34 మంజూరు కాగా అందులో 25 స్లాబ్ పోసి ఉంచారు. బచ్చన్నపేట మండల కేంద్రానికి 38 మంజూరయ్యాయి. నాలుగు సంవత్సరాల క్రితమే ప్రజాప్రతినిధులు భూమి పూజ చేసినా ఇంకా పునాది పనులు కూడా ప్రారంభం కాలేదు.

ఏడేళ్లు గడుస్తున్నా ముందుకు సాగని నిర్మాణం

రెండు పడక గదుల ఇళ్ల పథకంలో భాగంగా మండలంలోని తిమ్మంపేట, తమ్మడపల్లి(ఐ)లో 2017లో ప్రభుత్వం ఒకొక్క గ్రామానికి 25 ఇళ్లను మంజూరు చేసింది. నిర్మాణ పనులను ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ప్రారంభించారు.

ఆరేళ్లు గడుస్తున్నా 25 ఇళ్లకు కేవలం 12 ఇళ్లు మాత్రమే కప్పు వరకు పూర్తి అయ్యాయి. తిమ్మంపేటలో 25 ఇళ్లకు 8 ఇళ్లు స్లాబ్ వరకు పూర్తి చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను అర్హులైన పేదలకు అప్పగించేందుకు ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఇటీవల గ్రామ సభలను నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌కు పంపకుండానే తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పారు. ఆదే విధంగా ఉప్పుగల్లులో ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో 25 మందికి రెండు పడకల గదుల నిర్మాణం కోసం ఎమ్మెల్యే ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఇక్కడ ప్రారంభ పనులు కూడా పూర్తి కాలేదు. లబ్ధిదారులు ఇంకెప్పుడా అని కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.

నాలుగేళ్లుగా నత్తనడకనే...

మండలంలోని గూడూరు గ్రామంలో పరిశీలించగా, ఇక్కడ 71 ఇండ్లు పూర్తయి దాదాపు నాలుగేళ్లు అవుతున్నాయి. నేటికీ లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ పూర్తి కాలేదు.. ఏళ్లుగా ఇండ్లు నిరుపయోగంగా ఉండడంతో కిటికీలు, తలుపులు పాడవుతున్నాయి. నివాస సముదాయాలు పూర్తిగా అధ్వానంగా మారాయి. పిచ్చిమొక్కలు చెట్లవుతున్నాయి. పలువురు లబ్ధిదారులను ఎంపిక చేసినా వారికి ఇళ్లు మంజూరు చేయలేదని తెలుస్తోంది. రెండు, మూడు విడతల్లో గ్రామానికి అదనంగా మరో 54 ఇండ్లు మంజూరయ్యాయి, కానీ ఇప్పటివరకు పనులు మొదలు పెట్టలేదు. ఇప్పటికైనా పూర్తయిన ఇళ్లను అందజేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గుత్తేదారులు రాని చోట ప్రత్యామ్నాయం...-జిల్లా హౌసింగ్ ఈఈ, ఇళ్ల పథకం నోడల్ అధికారి దామోదర్‌రావుజిల్లాలో రెండు పడకగదుల ఇళ్ళ నిర్మాణం పథకం అమలుకు జిల్లా ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమీక్షలు జరుగుతున్నాయి. గుత్తేదారులు ముందుకు రానిచోట, ప్రత్యామ్నాయం పరిశీలిస్తున్నాము. లబ్ధిదారుల ఎంపిక గ్రామసభల ద్వారానే జరుగుతోంది. ప్రలోభాలకు లొంగవద్దు.

# గూడు లేక.. గోడు!



భూపాలపల్లి : నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. గూడులేని పేదోళ్లు ఇళ్ల కోసం ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఆరేళ్లుగా నిరీక్షణే మిగిలింది.. కనీసం పూర్తయిన వాటికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టకపోవడంతో వృథాగా పోతున్నాయి. జిల్లాకు రెండు విడతల్లో 3,882 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 1003 మాత్రమే పూర్తయ్యాయి. 515 ఇళ్లు చివరి దశలో ఉన్నాయి. స్థలాభావం, తదితర సమస్యలతో 1,363 ఇళ్లు మొదలుపెట్టలేదు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. నిధుల కొరత, ఇతరత్రా కారణాలతో ముందుకు సాగడంలేదు. గతంలో లబ్ధిదారుల కమిటీలతో నిర్మాణాలు చేపట్టారు. తర్వాత నిధుల మంజూరులో జాప్యం కావడంతో అర్ధంతరంగా నిలిచాయి. గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పూర్తయిన చోట లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యమవుతోంది. జిల్లా కేంద్రంలో 544, గణపురంలో 100 ఇళ్లు పూర్తయి మూడేళ్లు దాటినా లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. దీంతో నిరుపయోగంగా మారాయి. ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకున్నాయి. భూపాలపల్లిలో ఇళ్ల సామగ్రి దొంగలెత్తుకెళ్లారు. దీంతో తిరిగి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. లబ్ధిదారులు ఎంపిక చేసిన చోట పనులు పూర్తికాకున్నా పేదలు అసంపూర్తి ఇళ్లల్లోనే తలదాచుకుంటున్నారు. సంక్రాంతికల్లా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా.. ఇప్పటికీ పనులు పూర్తి కాలేదు. ఇప్పటికైనా వేగవంతం చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో వేశాలపల్లిలో జీప్లస్-3 విధానంలో షియర్‌వాల్ పద్ధతిలో 544 రెండు పడక గదుల ఇళ్లను నిర్మించారు. పనులు పూర్తయ్యాయి. మూడేళ్లు నిరుపయోగంగా ఉన్నాయి. గత నెలలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇప్పటివరకు లబ్ధిదారుల ఎంపిక జరగలేదు. ఇక్కడ నెర్రలు బారిన ఫ్లోరింగ్ గణపురం మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇంటిది.. ఇక్కడ దాదాపు 100 ఇళ్లు నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులను ఎంపిక చేయడం లేదు. శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గణపురం మండల కేంద్రంలో పూర్తయిన ఇళ్లు.. లబ్ధిదారుల ఎంపిక చేయకపోవడంతో దాదాపు మూడేళ్లుగా నిరుపయోగంగా మారాయి.

# ప్రతిపాదనలు ఎనిమిది.. మంజూరు మూడింటికి

సిరిసిల్ల: జిల్లాలో మండల కేంద్రాల నడుమ రవాణా సౌకర్యానికి వాగులు అడ్డంకిగా మారాయి. వీటిపై వారధుల నిర్మాణ పనులు రెండేళ్లుగా ముందుకు సాగడం లేదు. మూల, మానేరు వాగులపై వారధుల నిర్మాణానికి రహదారులు భవనాలశాఖ ఎనిమిది చోట్ల రూ.85 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. ఇందులో అందులో మూడు వంతెనలకు రూ.24 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. మిగతావి ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినవి సైతం టెండర్ల దశలోనే ఉన్నాయి. పనులు దక్కించుకున్న గుత్తేదారులు వాటిని ఒప్పందం చేసుకోవాలి. దీనికి ఇంకా సమయం పట్టేలా ఉంది. వచ్చే వానాకాలం కూడా వాగులపై ప్రయాణానికి అవస్థలు తప్పేలాలేవు. ఏటా నిర్వహించే రహదారుల మరమ్మతులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో మానేరు, మూలవాగులపై ఒక్కో చోట సగటున 180 మీటర్ల నుంచి 40 మీటర్ల పొడవు ఉంటుంది. వీటిలో 40 మీటర్లలోపు ఉన్న వంతెనలకు మాత్రమే నిధులు విడుదల చేశారు. రెండేళ్లుగా కురిసిన వర్షాలకు మూలవాగుపై కాజ్‌వేలపై నుంచి వరద ప్రవహించడంతో వేములవాడ, కోనరావుపేట, చందుర్తి, బోయినపల్లి మండలాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటు మూలవాగుపై ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాలకు పరిస్థితి అదే విధంగా ఉంది. వీటిలో వేములవాడ-చీర్లవంచ రహదారిలో రూ. 3.52 కోట్లతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

# మీ ఇల్లు సల్లగుండ!

కరీంనగర్ : ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మున్ముం దు ఇంకా పెరగనున్నాయి. పెంకుటిల్లు ఏ కాలానికి ఆ కాలం హాయిగా ఉండేది. కాంక్రీట్ శ్లాబులు కావడంతో భగభగ మండుతున్నాయి. వాస్తవ గది ఉష్ణోగ్రత 24 డిగ్రీలు మాత్రమే ఉండాలి. మండుతున్న ఎండలతో గది తాపం పెరుగుతోంది. దీనిని అధిగమించేందుకు నగర, పురపాలికల్లో భవన నిర్మాణ అనుమతుల్లో మార్పులు తీసుకొచ్చారు. టీఎస్‌బీపాస్‌లో చలువ పైకప్పు(కూల్ రూఫ్) పాలసీని అమల్లోకి తెచ్చారు. ఈనెల 1 నుంచి ప్రభుత్వ, వాణిజ్య భవనాలకు తప్పనిసరి చేశారు. ఉమ్మడి జిల్లాలో 42.1 లక్షల చదరపు గజాల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నగర, పట్టణ జనాభా విపరీతంగా పెరుగుతోంది. మానవ అవసరాలకు తగ్గట్లుగా ప్రైవేటు, వాణిజ్య భవనాల సంఖ్య కూడా పెరిగింది. ఇవన్నీ కాంక్రీట్ శ్లాబులు ఉండటంతో ఎండాకాలంలో నలనల కాగుతున్నాయి. చెట్లు కూడా లేకపోవడంతో చల్లని గాలి అనేది లేకుండా పోతుంది. వేడి వాతావరణ ంతో జనం ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి వస్తోంది. సామాన్యులు కూలర్లను ఆశ్రయిస్తుండగా, స్తోమత ఉన్న వారు ఏసీలను వినియోగిస్తున్నారు. రెండేళ్లుగా ఏసీల కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది. ఏసీలు, కూలర్లు అమర్చుకోలేని పేదలు.. వేడితో వడదెబ్బకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పురపాలక శాఖ చలువ పైకప్పుల వైపు ప్రణాళికలు ప్రారంభించింది. తద్వారా భవనాల వేడి తగ్గి, సౌకర్యవంతంగా ఉండటంతోపాటు విద్యుత్తు ఆదా అవుతుంది.

600 చ.గ. నిర్మాణాలకు తప్పనిసరి

నగరాలు, పట్టణాల్లో ఇక మీదట ప్రభుత్వ, ప్రైవేటు భవనాలకు చలువ పైకప్పులు తప్పనిసరి చేశారు. 600 చదరపు గజాలు పైబడి విస్తీర్ణంలో నిర్మించే అన్ని రకాల నిర్మాణాలకు ఇది వర్తించనుంది. అలాంటి నిర్మాణాలకే నివాస వినియోగ ధ్రువపత్రం జారీ చేస్తారు. 600 చదరపు గజాల కన్నా తక్కువ విస్తీర్ణంలోని నిర్మాణాలకు ఈ నిబంధన ఐచ్ఛికం.

కొత్తగా నిర్మించే ప్రభుత్వ, వాణిజ్య భవనాలకు కూల్ రూపింగ్ తప్పనిసరి కానుంది.

ఒక్కో చదరపు అడుగుకు రూ.300 మాత్రమే ఖర్చు అవుతుంది.

పెట్టిన ఖర్చు.. విద్యుత్తు పొదుపు ద్వారా రెండేళ్లలో వస్తోంది.

బలహీన వర్గాలకు నిర్మించే ఇళ్లకు ప్రభుత్వం కూల్ రూఫ్ అమలు చేయనుంది. నివాసిత భవనాలకు తప్పనిసరి కాదు. కానీ ప్రోత్సహిస్తోంది.

5 డిగ్రీల వరకు తగ్గనున్న వేడి..

కూల్ రూఫ్ విధానంతో గది ఉష్ణోగ్రతలో మార్పులు వస్తాయి. ఆధునిక సాంకేతికతో పైకప్పులకు రసాయనాల వినియోగంతో 5 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు తగ్గుతుందని అంటున్నారు.

సూర్యకిరణాలు పరివర్తనం చెందేలా శ్లాబుపై ప్రత్యేక తెల్లని పూత వేస్తారు. లైమ్ వాష్, ఆక్రిలిక్ పాలిమార్ వినియోగిస్తారు.

మరో విధానంలో పాలివినైల్ క్లోరైడ్(పీవీసీ)తో పైకప్పునకు మెరుగులు పెడతారు.

మూడో విధానంలో ఆల్బిడో, సిరామిక్, మొజాయిక్ టైల్స్‌ను స్లాబ్‌పై అమరుస్తారు. సాధారణ భవనాలతో పోల్చితే చలువ పైకప్పులు ఉన్న నిర్మాణాలు 75 శాతం తాపాన్ని తగ్గిస్తాయి.

నగరపాలికలు : 2
మున్సిపాలిటీలు :14
డివిజన్లు/వార్డులు : 461
జనాభా 11,27,81

# ఈ నీరెలా తాగేది!

గోదావరిఖని: సింగరేణి నీటి సరఫరాతో కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. మూడు రోజులుగా రంగుమారిన నీరు సరఫరా కావడంతో వాటిని తాగలేకపోతున్నామని అంటున్నారు. కనీసం ఇతర అవసరాలకు వినియోగించుకునే పరిస్థితి కనిపించడం లేదు. స్నానానికి వినియోగించినా దురద వస్తుందని పలువురు చెబుతున్నారు. గత కొంత కాలంగా సింగరేణి నీటి సరఫరాపై కార్మిక కుటుంబాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ విధానంతో నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలన్న ప్రతిపాదనలపై ఇటీవలె బోర్డు రూ.20 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంకా పనులు మొదలు కాలేదు. సింగరేణి సంస్థ గోదావరినది నుంచి నీటిని సేకరించి కార్మిక కుటుంబాలకు సరఫరా చేస్తోంది. ఫిల్టర్ విధానంలో లోపాలు తలెత్తడంతో కార్మిక వాడలకు మురుగు నీరు సరఫరా అవుతున్నాయా.. లేదంటే మరే కారణం చేత నీటి సరఫరాలో లోపాలు తలెత్తుతున్నాయా అన్న విషయంలో స్పష్టత లేదు. రామగుండం ప్రాంతంలోని ఆర్జీ-1, 2, 3 డివిజన్‌లలో నివసించే కార్మిక కుటుంబాలకు రోజుకు 30 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తున్నారు. గోదావరినదిలోని ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీల ద్వారా సేకరించిన నీటిని 14వేల కార్మిక నివాస గృహాలతో పాటు మరో 10 వేల ప్రైవేటు గృహాలకు సంస్థ నీటిని సరఫరా చేస్తోంది. ఈ నీటి సరఫరాపై 25 వేల కుటుంబాలు ఆధారపడ్డాయి. మూడు రోజులుగా తాగునీటి సరఫరాలో లోపాలు తలెత్తడంతో రంగు మారిన నీరు సరఫరా అవుతున్నాయి. వాటిని తాగేందుకు కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి.

మరమ్మతులు చేసినా మళ్లీ మొదటికే...

సింగరేణి ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీలకు మరమ్మతు చేసినా సమస్య మళ్లీ మొదటికే వచ్చింది. ఇప్పటికే రెండుసార్లు బావుల్లోకి దిగి లీకేజీ ఉన్న ప్రాంతాలను మూసివేశారు. దీంతో పాటు పైకప్పులను సరిచేశారు. అయినా రంగుమారిన నీరు సరఫరా కావడంతో సమస్య ఎక్కడ ఉందన్న విషయమై స్పష్టత రాలేదు. ఇన్‌ఫిల్ట్రేషన్ గ్యాలరీల నుంచి సేకరించిన నీటిని ఇన్‌టేక్‌వెల్ వద్ద పంపు మోటార్లతో కాలనీలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలో ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల నుంచి వచ్చే నీటిలో సమస్య లేదని స్పష్టత వచ్చింది. అయితే రంగు మారడానికి కారణాలను అన్వేషిస్తున్నారు. క్లోరినేషన్ ప్రక్రియ ద్వారా రంగు మారుతుందా.. పాత పైపులు కావడంతో వాటిలో ఏర్పడ్డ రస్టు వల్ల నీరు రంగు మారుతుందా అన్నదానిపై ఎలాంటి స్పష్టత లేదు. చాలా సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్లు కావడంతో వాటి జీవిత కాలం పూర్తి కావడంతోనే నీటి సరఫరాలో లోపాలు తలెత్తుతున్నట్లు భావిస్తున్నారు.

ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ విధానమే మేలు

నీటి సరఫరాను మెరుగుపరిచేందుకు వెంటనే ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ విధానాన్ని తీసుకురావాలి. మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి మాదిరిగా సింగరేణి కూడా అదే పద్ధతిని అమలు చేస్తే భవిష్యత్తులో నీటి సరఫరాలో ఎలాంటి లోపాలు ఉండవు. సింగరేణి యాజమాన్యం రామగుండం ప్రాంతానికి ర్యాపిడ్ గ్రావిటీ ఫిల్టర్ విధానానికి రూ.20 కోట్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. వెంటనే దీనికి సంబంధించిన పనులు చేపడితే తాగునీటి సరఫరా మెరుగయ్యే అవకాశం ఉంది.

# పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన

భూపాలపల్లి : ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జిల్లాలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమ బోధన ప్రారంభించారు. అదే స్థాయిలో మౌలిక వసతుల కల్పన కోసం 'మన ఊరు.. మన బడి' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 149 విద్యాలయాలను ఎంపిక చేశారు. ఇందులో రూ.30 లక్షల్లోపు వ్యయం గల అభివృద్ధి పనులు చేపట్టగా కొన్ని బడుల్లో పూర్తికాగా, మరికొన్ని ప్రాంతాల్లో చివరి దశకు చేరుకున్నాయి. అంతకుమించి నిధులు మంజూరైన బడుల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు టెండర్లు నిర్వహించారు. అయినా కొన్ని పాఠశాలల్లో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాని ప్రాంతాల్లో ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీలు, ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణలో పనులు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

విషయ పరిజ్ఞానం పెంచేందుకు..

విద్యార్థుల్లో పూర్తి స్థాయిలో విషయ పరిజ్ఞానం పెంపొందించాలన్న ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం దృశ్యరూపంలో డిజిటల్ బోధన అందించేందుకు తాజాగా ప్రణాళికలు రూపొందించింది. ప్రధానంగా 8, 9, 10 తరగతులు చదివే విద్యార్థుల సౌలభ్యం కోసం వీటి ఏర్పాటు



కు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే జయశంకర్ జిల్లాలో మొదటి విడతలో 51 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. స్మార్ట్‌క్లాస్ రూమ్‌లలో నాలుగు ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి విద్యాలయానికి 75 ఇంచులు గల మూడు మానిటర్లు సమకూర నున్నాయి. 2 కేవీ యూపీఎస్‌లు, ఒక మెటల్ ఫ్రేమ్‌తో కూడిన బోర్డు యాప్‌ల సహాయంతో పాఠాలు బోధించేందుకు బోర్డు ఈ విధానంపై ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాలవారీగా నిర్వహణ బాధ్యతలను ఆయా కంపెనీలకు అప్పగించారు.

విద్యార్థుల్లో పట్టు పెంచేందుకే.. - రాంకుమార్, డీఈవో, భూపాలపల్లి ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. రాబోయే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలోని 51 ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం డిజిటల్ స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు ఎంతో మేలు చేకూరనుంది. దృశ్య రూపంలో బోధన అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సబ్జెక్టులపై పూర్తి స్థాయిలో విద్యార్థులు పట్టు సాధించే అవకాశం ఏర్పడనుంది.

# ఆరోగ్యనగరి ఓరుగల్లు

వరంగల్ : వచ్చే దసరా నాటికి 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో సూపర్ సీట్లు ఇప్పుడు ఎంతో కీలకం కానున్నాయి. వైద్యుల భర్తీపై ప్రభుత్వం దృష్టిసారిస్తే మిగతా సూపర్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వైద్యం కింద సూపర్ స్పెషాలిటీ సీట్లు వచ్చిన ఘనత కాకతీయ వైద్యకళాశాల (కేఎంసీ)కు దక్కింది. ఇటీవల నెఫ్రాలజీ విభాగంలో 5, అత్యవసర వైద్యం (ఎమర్జెన్సీ మెడిసన్)లో మరో 5.. మొత్తం పది సూపర్ స్పెషాలిటీ సీట్లు దీనికి మంజూరయ్యాయి. దీంతో ఎంబీబీఎస్, పీజీ సీట్లకే పరిమితమైన కేఎంసీలో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

మూత్ర పిండాల రోగులకు ఆధునిక వైద్యం

నెఫ్రాలజీ విభాగంలో అయిదు సీట్లు రావడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వరంగల్ ఎంజీఎంకు నిత్యం పెద్ద సంఖ్యలో మూత్ర పిండాల సమస్యలతో బాధితులు వస్తుంటారు. ఈ క్రమంలో నెఫ్రాలజీలో విద్యార్థులు సూపర్ స్పెషాలిటీ కోర్సు చేసే అవకాశం రావడం వల్ల కిడ్నీ మార్పిడి, ఇందులో శస్త్రచికిత్సలు వంటి కీలక సేవలు సాధ్యపడతాయి. ప్రయివేటులో సూపర్ స్పెషాలిటీ మూడేళ్ల పీజీ చేయడం చాలా వ్యయప్రయాస కాబట్టి ఇక్కడ అందుబాటులోకి వస్తే పేద విద్యార్థులకు కూడా సూపర్ కోర్సు చేసే అవకాశం దక్కుతుంది.

గాయపడ్డవారికి సత్వర చికిత్స

నిత్యం ఎంజీఎంకు రోడ్డు ప్రమాదాల బాధితులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అత్యవసర వైద్యం విభాగంలో సేవలు అందుబాటులోకి వస్తే గాయపడ్డవారికి ఎలాంటి చికిత్స చేయాలనే సందేహం లేకుండా సరైన సమయంలో నిర్ణయం తీసుకొని మెరుగైన చికిత్స అందిస్తారు.

వైద్యులను నియమించాలి..

ఇప్పటికే ప్రధానమంత్రి స్వస్థ్ సంరక్షణ యోజన (పీఎంఎస్ఎస్‌వై) కింద కాకతీయ వైద్య కళాశాల 250 పడకలతో సిద్ధమైంది. సరిపడా వైద్యులు ఉంటే మరికొన్ని సూపర్ స్పెషాలిటీ వైద్య సీట్లు వచ్చి ఉండేవి. నెఫ్రాలజీ, ఎమర్జెన్సీ విభాగాల్లోని ఒక్కో యూనిట్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ల పోస్టులు ఉండడం వల్ల ఈ రెండు విభాగాల్లో సూపర్ సీట్లు సాధ్యమయ్యాయి.

మిగతా 8 విభాగాల్లోనూ సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి రావాల్సి ఉంది. కేఎంసీకి అనుబంధంగా ఉన్న ఎంజీఎంలోని అన్ని విభాగాల్లో వైద్యుల కొరత వల్ల ఇవి మంజూరు కావడం లేదు. ఇక్కడ అత్యంత కీలకమైన కార్డియాలజీ విభాగంలోనే సూపర్ స్పెషాలిటీ సీట్లు లేవు. కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటుకావడం వల్ల పలువురు వైద్యులను అటు బదిలీ చేశారు. గుండె శస్త్రచికిత్సలు చేసే కార్డియాలజీ, పీడియాట్రిక్స్, యూరాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, నియోనాటాలజీ, మెడికల్ ఆంకాలజీ, న్యూరాలజీ, రుమటాలజీ విభాగాల్లోనూ 5 సీట్ల చొప్పున రావాల్సి ఉంది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ వారు కేఎంసీలో ఆయా విభాగాల్లో సరిపడా వైద్యులను శాశ్వత ప్రాతిపదికన నియమిస్తే వచ్చే ఏడాది ఈ సీట్లు వచ్చే అవకాశం ఉంది. మనకెంతో ఉపయుక్తం- డాక్టర్ వి.చంద్రశేఖర్, సూపరింటెండెంట్, ఎంజీఎం ఆసుపత్రినేను 2017లో కేఎంసీ ప్రిన్సిపల్‌గా పనిచేసినప్పుడు సూపర్ స్పెషాలిటీ సీట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జాతీయ వైద్య మండలికి దరఖాస్తు చేశాం. ఇటీవల రెండు విభాగాల్లో సూపర్ సీట్లు మంజూరయ్యాయి. వీటి వల్ల మూత్ర పిండాల సమస్యలకు మెరుగైన చికిత్స ఇచ్చే అవకాశం ఉంది. ఈ విభాగాల్లో వైద్యులు సెలవుపై వెళ్లినా పీజీ వైద్యులు అందించగలరు.

# ధాన్యం సేకరణకు సర్వం సిద్ధం



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో యాసంగి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల వరికోతలు ప్రారంభమవగా.. అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకొచ్చి ఆరబెడుతున్నారు. ఖమ్మం జిల్లాలో 4,00,000 మెట్రిక్ టన్నులు.. భద్రాద్రి జిల్లాలో 1,56,040 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. రైతులు అధికంగా 1010, 126, హెచ్‌ఎంటీ రకాలు సాగు చేశారు. ఏ-గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాకు రూ.2,060, సాధారణ రకం వడ్లకు రూ.2,040 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. గతేడాది గన్నీ సంచులు, ధాన్యం శుభ్రం చేసే యంత్రాల కొరత వేధించింది. వర్షాలొస్తే ధాన్యం కాపాడుకునేందుకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో లేవు.

ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం జిల్లాలో యాసంగి సీజన్‌లో 2,33,380 ఎకరాల్లో వరిపైరు సాగైంది. సుమారు 5,08,645 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. స్థానిక అవసరాలకు పోను 4,34,018 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. 230 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. కూసుమంచి, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాల్లో రెండ్రోజుల్లోగా ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నారు. ధాన్యం సేకరణకు సుమారు కోటి గన్నీ సంచుల అవసరమని గుర్తించారు. జిల్లాలో ఇప్పటికే 58 లక్షల సంచులు అందుబాటులో ఉన్నట్లు తేల్చారు.

భద్రాద్రి జిల్లాలో 62,468 ఎకరాల్లో వరి సాగైంది. 1,56,040 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. 134 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. మూణ్నాలుగు రోజుల్లో కోతలు మొదలయ్యే అవకాశముంది.

అకాల వర్షాలతో వణుకు

ఇప్పటికే ఈ సీజన్‌లో అకాల వర్షాలు, ఈదురుగాలులు అన్నదాతలను నష్టాలపాలు చేశాయి. చేతికొచ్చే దశలో మొక్కజొన్న, మామిడి తోటలు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ప్రారంభించనున్న కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు సమకూర్చాలని రైతులు వేడుకుంటున్నారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన కొని రవాణా చేయాలని కోరుతున్నారు.

కోత.. వాత

పచ్చి గింజ, తాలు, తడిసిన ధాన్యం, రంగు మారడం, తేమ వంటి సాకులతో కొందరు మిల్లర్లు తూకంలో భారీ కోత విధించారు. క్వింటాకు ఐదు నుంచి పది కిలోలు తరుగు తీయడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ఈసారి ఇలాంటి సమస్యలు ఎదురవకుండా అధికారులు పర్యవేక్షించాలి.

14 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి పంట పండించాను. పది రోజుల క్రితమే కోసి ధాన్యాన్ని ఆరబెడుతున్నాను. వ్యాపారులు, దళారులకు అమ్ముకుందామంటే తక్కువ ధరకు అడుగుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వెంటనే తెరవాలి.

వరికుళ్ల నరసింహారావు, రైతు, మిట్టపల్లి

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ముందుగా వరికోతలు ప్రారంభమైన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తాం. క్రమేణా జిల్లా వ్యాప్తంగా 230 కేంద్రాలు తెరుస్తాం. కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు ఆస్కారమివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. మధుసూదన్, అదనపు కలెక్టర్, ఖమ్మం

# బొగ్గు ఉత్పత్తిలో రారాజులు



ఖమ్మం : సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరంలో 7.40 కోట్ల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. లక్ష్యసాధనలో ఐదు ఏరియాలు సత్తాచాటగా ఎక్కువ బొగ్గు ఉత్పత్తి చేసిన వాటిలో ప్రథమ స్థానంలో కొత్తగూడెం, ద్వితీయ స్థానంలో మణుగూరు నిలిచాయి. రవాణాలోనూ ఈరెండు ఏరియాలు రాణిస్తున్నాయి. ఉత్పత్తిలో సింహభాగం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బొగ్గు గనులదే.

క్రమేణా పెరుగుతున్న లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో అపారమైన బొగ్గు గనులున్నాయి. కేటీపీఎస్, బీటీపీఎస్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని విద్యుదుత్పత్తి కేంద్రాలకు అవసరమయ్యే బొగ్గు ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ఏరియాల నుంచి రవాణా అవుతుంది. బొగ్గు నిల్వలు అపరిమితంగా ఉన్న నేపథ్యంలో సింగరేణి సంస్థ ఇక్కడి ఏరియాల ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచుతూ వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం- 1.40 కోట్లు, మణుగూరు ఏరియా 1.16 కోట్ల టన్నులను ఉత్పత్తి చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఈ రెండింటి ఉత్పత్తి లక్ష్యాన్ని అధికారులు పెంచారు.

ఉపరితల గనుల వల్లే..

ఉపరితల గనుల వల్లే కొత్తగూడెం, మణుగూరు ఏరియాల్లో అధికంగా బొగ్గు ఉత్పత్తి అవుతోంది. వీటిలో ఒక్కో భూగర్భగని, మూడు చొప్పున ఉపరితల గనులు ఉన్నాయి. రెండింటిలో ఉపరితల గనుల నుంచి ఎక్కువ బొగ్గు ఉత్పత్తి అవుతుంది. నల్లబంగారం అవసరాల దృష్ట్యా కొత్తగూడెంలోని వెంకటేశ్ ఖని, మణుగూరు ఏరియాలో రాబోయే అయిదేళ్లలో మల్లేపల్లి(మణుగూరు ఓసీ)ని విస్తరించనున్నారు. జిల్లాలో భూగర్భ, ఉపరితల గనుల నుంచి జీ- 6, 7, 9, 13, 14 నాణ్యత గల బొగ్గు ఉత్పత్తి అవుతుంది.

ఉమ్మడి జిల్లాలో బొగ్గు నిల్వలు అధికంగా ఉన్నాయి. బొగ్గు పొర కూడా మందమే. అందుకే నాణ్యమైన బొగ్గు ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి అవుతుంది. కేటీపీఎస్, బీటీపీఎస్ ప్లాంట్లకు ఇక్కడి ఏరియాల నుంచే బొగ్గు రవాణా అవుతుంది. జక్కం రమేశ్, జీఎం, కొత్తగూడెం

# పిక్కలను పట్టేస్తున్న కుక్కలు

ఖమ్మం :వీధి కుక్కలు.. ఇంటిల్లిపాదిని కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.. ఆహార పదార్థాలు, ఇతర అవసరాల కోసం బయటకు వెళ్తున్న చిన్నారులు వీటి బారిన పడి బెంబేలెత్తిపోతున్నారు.. ఎక్కడపడితే అక్కడ గుంపులు గుంపులుగా శునకాలు దర్శనమివ్వడం, వాటికి కోపమస్తే చాలు.. కరవడం.. బాధితులు ఆసుపత్రులకు వెళ్లడం ఉభయ జిల్లాల్లో సర్వసాధారణంగా మారింది.. అయినా అధికార యంత్రాంగం వాటి కట్టడికి ఉపక్రమించకపోవడం గమనార్హం. టేకులపల్లికి చెందిన ఇస్లావత్ అశోక్, కవిత కుమారుడు అక్షయ్‌నాయక్(4). పుట్టినరోజు. నిత్యం మాదిరిగానే టేకులపల్లి ముత్యాలమ్మగుడి వీధిలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాడు. టీచర్, ఆయా కేంద్రంలో చిన్నారులకు అన్నం పెడుతున్న సమయంలో సమీపంలోనే బయట ఆడుకుంటున్న అక్షయ్‌నాయక్‌పై వీధి కుక్క దాడి చేసింది. ఈ ఘటనలో అక్షయ్‌నాయక్ ఎడమ తొడకు ఏడు గాట్లు పడ్డాయి. హుటాహుటిన బాలుడిని సులానగర్ పీహెచ్‌సీకి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. పుట్టినరోజు నాడే కుమారుడు కుక్క కాటుకు గురి కావడంతో తల్లిదండ్రులు విచారం వ్యక్తం చేస్తున్నారు. కాగా టేకులపల్లికి చెందిన సీహెచ్ నిరోష, టి.నవనీత్, టి.ఆయూష్, బావోజీతండాకు చెందిన ప్రణయ్‌లకు కూడా మంగళవారమే కుక్కకాటుకు గురయ్యారు. కొత్తగూడెం పట్టణం న్యూగొల్లగూడెం 16వ వార్డులోని రాజీవ్ గృహకల్పలో నివాసము ంటున్న కుమార్, మానస కూతురు జెస్సీ(4) అంగన్‌వాడీ పాఠశాలకు వెళ్తుంది. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో కుక్కల గుంపు బాలికపై ఒక్కసారిగా దాడి చేశాయి. కుక్కలు గట్టిగా అరుస్తూ చిన్నారి ఏడుపు



వినిపించడంతో తల్లిదండ్రులు బయటికి వచ్చారు. ఇంతలో కుక్కలు చిన్నారిపై ఎగబడుతుండగా వాటితో పెనుగులాడుతున్న చిన్నారిని చూసి భయాందోళనకు గురయ్యారు. కుక్కలను తరిమి గాయపడ్డ చిన్నారిని హుటాహుటినా జిల్లా సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఒంటి నిండా గాయాలతో రక్తం కారుతున్న చిన్నారిని చూసి తల్లిదండ్రులు విలవిలలాడారు. ప్రస్తుతం ఆ బాలికకు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయిస్తున్నారు. కుక్కల సంచారంపై పురపాలక అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

# పనులు పూర్తి చేయరు.. లబ్ధిదారులకు ఇవ్వరు!!

జనగామ : నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. గూడులేని చాలా మంది ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కాని ఆరేళ్లుగా వారి కల నెరవడం లేదు. కనీసం పూర్తయిన వాటికి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టక పోవడంతో వృథా ఉంటున్నాయి. మరికొన్ని అసంపూర్తి నిర్మాణాలతో దర్శనమిస్తున్నాయి. గూడుకోసం ఎదురుచూపులే మిగులుతున్నాయి.

ఆగుతూ.. సాగుతూ..

జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాకు రెండు విడతల్లో 4,480 ఇళ్లు కేటాయించారు. ఇందులో 4309 ఇళ్లకు పరిపాలనా అనమతులు వచ్చాయి. 4120 నిర్మాణాలకు టెండర్లు పిలిచారు. 654 పనులు వివిధ దశల్లో ఉండగా, 2014 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకు 329 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు కేటాయించారు. మిగతావి నిధుల కొరత, ఇతరత్ర కారణాలతో ముందుకు సాగడంలేదు. గుత్తేదారులు కూడా ముందుకు రాకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పరకాల మండలం వెల్లంపల్లిలో 65 రెండు పడక గదుల ఇండ్లు మంజూరయ్యాయి. వాటిలో బీస్మీ కాలనీలో 36 ఇండ్ల నిర్మాణం పనులు పూర్తి కావడంతో లబ్ధిదారులకు కేటాయించగా 2021 సంవత్సరంలో గృహ ప్రవేశాలు జరిగాయి. ఇదే గ్రామంలో ఎస్సీ



కాలనీలో 29 గృహాలు మంజూరు కాగా ప్రస్తుతం నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటి వరకు రంగులు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది.

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు బొల్లపల్లి రమేష్. దామెర మండల కేంద్రంలో రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేశారు. తన సొంత ఇంటిని కూల్చివేసి, నూతనంగా ఇంటిని నిర్మించుకున్నాడు. నిర్మాణం అనంతరం బిల్లులను నమోదు చేసిన అధికారులు ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. తన ఇంటిని నిర్మించుకోవడానికి అప్పులు చేశానని, వీటికి వడ్డీలు పెరిగి ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. ఇతనితో పాటు మండల కేంద్రంలో మరికొందరికి ఇళ్లు మంజూరు చేయగా, వారు నిర్మాణం చేసినా కొంత మందికి సగం బిల్లును అధికారులు ఇచ్చారని, మిగతా వారికి మాత్రం రూపాయి కూడా ఇవ్వలేదని వాపోయారు.

అయిదేళ్లుగా నిరీక్షణ

హనుమకొండ బాలసముద్రం ఏషియన్ శ్రీదేవి మాల్ సమీపంలోని అంబేద్కర్ నగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం బహుళ అంతస్తుల్లో రెండు పడక గదుల సముదాయాలు నిర్మించింది. మొత్తం 37 బ్లాకులు ఉండగా, ఒక్కో బ్లాకులో 16 ఇళ్లు నిర్మించారు. పనులు పూర్తయి ఐదేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. 592 మంది లబ్ధిదారులు తమకు సొంతింటి కల ఎప్పుడు నెరవేరుతుందా అని ఎదురు చూస్తున్నారు. బహుళ సముదాయాల మధ్యన పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. గదుల అద్దాలు పగిలిపోతున్నాయి. బాలసముద్రం

భీమదేవరపల్లి మండలం ములుకనూర్ గ్రామానికి 40 రెండు పడక గదుల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. గుత్తేదారు నిర్లక్ష్యంతో పనులు పునాదులకే పరిమితమయ్యాయి. ఇనుప చువ్వలు చిలుము పట్టిపోయాయి. ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. స్థలం ఇస్తే తాము రేకుల షెడ్లు వేసుకొని ఉండేవాళ్లమని పులువురు లబ్ధిదారులు వాపోతున్నారు. భీమదేవరపల్లి

ఆగిన నిర్మాణాలు

కమలాపూర్‌లో 320, మరిపల్లిగూడెం, గూడూరు గ్రామాల్లో 50 ఇళ్ల చొప్పున నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు 80శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా పనులకు నిధులు మంజూరు కాకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మౌలిక వసతుల కల్పన, విద్యుత్తు సరఫరా, అంతర్గత సీసీ రోడ్లు, తదితర పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. కమలాపూర్

# ముందుకుసాగని మినీ ట్యాంక్‌బండ్ పనులు

రాయికల్ : రాయికల్ పట్టణం చుట్టూ గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో రాయికల్ వచ్చి స్థిరపడే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. నిత్యం వచ్చి పోయే వారి సంఖ్య దీనికి అదనం. యాంత్రిక జీవనంలో కాస్త ఉపశమనం పొందేందుకు ఆహ్లాదకర వాతావరణం లేక పట్టణ ప్రజలు అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో రాయికల్ పట్టణం మేజర్ గ్రామ పంచాయతీ నుంచి పురపాలక హోదా అందుకున్నాక రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లతో అభివృద్ధి పనులకు 2018లో శ్రీకారం చుట్టింది. ఈ నిధుల్లోంచి పెద్ద చెరువుపై మినీ ట్యాంక్‌బండ్, ఉద్యానవనం ఏర్పాటుకు ఆ నిధుల్లోంచి రూ.1.5 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో కట్ట వెడల్పు, రాయి అద్దకం, పార్క్ అభివృద్ధి, కర్బాస్ వాల్, రేలింగ్, మెట్ల నిర్మాణం, రిటర్నింగ్ వాల్ వంటి పనులు చేపట్టాల్సి ఉంది. 2018లో నిధుల మంజూరు కాగా 2022లో టెండర్ ప్రక్రియ ముగించుకొని పనులు ప్రారంభమయ్యాయి. 2022లోను వర్షాకాలం ఆరంభంలో పనులు ప్రారంభం కాగా భారీగా కురిసిన వర్షాలకు చెరువు నిండడంతో పనులు నిలిచిపోయాయి.

నాణ్యత లోపించి.. కంకర తేలి

పనులు దక్కించుకున్న గుత్తేదారు పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మెట్ల నిర్మాణ పనులు, రిటర్నింగ్ వాల్ పనులు పూర్తయినా పనుల్లో నాణ్యత లోపించి కంకర తేలింది. దీంతో పైపై పూతలు పూసి మరమ్మతులు చేశారు. చెరువు కట్ట వెడల్పు కోసం కట్టపై పోసిన మట్టి కోతకు గురైంది. ఉద్యానవనం ఏర్పాటు చేయాల్సిన స్థలంలో పెద్ద బండరాళ్లు ఉన్నా ఇంకా తొలగించలేదు. పనుల నాణ్యతను పరిశీలించాల్సిన ఇరిగేషన్ అధికారులు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పనుల పూర్తికి చర్యలువర్షాకాలంలో కురిసిన వర్షాలకు పెద్ద చెరువు నిండుకుండలా మారడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తుండటంతో నీటి మట్టం తగ్గింది. కట్టకు రాయి అద్దకం పనులు త్వరలోనే ప్రారంభిస్తారు. ట్యాంక్‌బండ్, ఉద్యానవనం పనులు సకాలంలో పూర్తి చేసేలా గుత్తేదారుకు ఆదేశాలు జారీ చేస్తాం. పనుల్లో నాణత పాటించకుంటే చర్యలు తప్పవు. భాస్కర్, ఇరిగేషన్ డీఈ

# రుణం అందేనా?

సిరిసిల్ల : యాసంగి వరికోతలు, ధాన్యం తరలింపుతో బిజీగా ఉన్న రైతులు వానాకాలం సాగుకు కూడా సన్నద్ధం అవుతున్నారు. ధాన్యం అమ్మితే వచ్చే డబ్బులు సర్ధుబాటుకు పోగా మళ్లీ పెట్టుబడిని సమకూర్చుకుంటున్నారు. ఇదే సమయంలో పంట రుణాల పరిమితి పెంపు ప్రకటన అన్నదాతలకు కొంత ఊరటనిస్తోంది. ఈసారి వానాకాలం సీజన్ అరంభానికి ఉందే 2022- 2023 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రుణపరిమితి పెంచుతున్నట్లు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రకటించింది. రుణ పరిమితి పెరగడంపై జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా బ్యాంకర్ల ఇబ్బందులు లేకుంటేనే ప్రయోజనం కలుగుతుందని భావిస్తున్నారు. జిల్లాలో ఏటా వ్యవసాయ రుణాల లక్ష్యాన్ని బ్యాంకర్లు పూర్తి చేయలేకపోతున్నారు. 2021-2022 ఆర్థిక సంవత్సరంలో 1,22,818 ఎకరాలకు రూ.1068.93 కోట్లు రుణాలు ఇవ్వాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. మార్చి వరకు 57,501 ఎకరాలకు రూ.682.38 కోట్లు మాత్రమే అందించారు. 2022-23 సంవత్సరానికి జిల్లా రుణ ప్రణాళిక రూ.2692.45 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వ్యవసాయం,



అనుబంధ పరిశ్రమలకు రూ. 1945.98 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో కిసాన్ క్రెడిట్ కింద రూ.1559.35 కోట్లు లక్ష్యంగా ఉంది. అనేక కారణాలతో రైతులకు రుణాలు పూర్తి స్థాయిలో అందడం లేదు. బ్యాంక్‌ల నిబంధనలు కొంత ఇబ్బందిగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

భారీగా రుణ పరిమితి పెంపు రాజన్న సిరిసిల్ల జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.80 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. అందులో వరి 1.63 లక్షల ఎకరాలు, పత్తి లక్ష ఎకరాలకు పైగా ఉంటుంది. యాసంగిలో ప్రస్తుతం 1.47 లక్షల ఎకరాల్లో 1.37 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పంటలపై గందరగోళం చేయడంతో రైతులు కొంత అయోమయంలో పడ్డా సాగు మాత్రం యథావిధిగా కొనసాగించారు. ఈ సారి కూడా జిల్లాలో సమృద్ధిగా సాగు నీరు లభిస్తుందనే నమ్మకంతో సాగు విస్తీర్ణాన్ని పెంచుకునే ఆలోచనలో రైతులు ఉన్నారు. దీనికి అనుగుణంగానే ఈ ఏడాది వానాకాలం ఇచ్చే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌ను ప్రభుత్వం పెంచింది. పత్తి, వరి, మొక్కజొన్న, సోయాబీన్, మిర్చి పొద్దుతిరుగుడు తదితర పంటల రుణపరిమితి భారీగా పెంచారు. గతేడాది కంటే రూ.2 నుంచి 3 వేల వరకు రుణపరిమితి పెరిగింది. వరిపై ఒక్క ఎకరానికి గతేడాది కంటే రూ.2 వేలు పెరగగా మిర్చి పైనా రూ.5 వేలు, పత్తి పైన రూ.2 నుంచి 3 వేలు, కందులు, మినుములు, రూ.వెయ్యి, ఆయిల్ ఫాంపై రూ.2 వేలు పెంచారు. దీంతో జిల్లాలోని రైతులకు రుణ పరిమితి ప్రయోజనకరంగా ఉండనుంది.

# యాసంగి సాగు సగమే..

ఖమ్మం : ఓ వైపు గోదావరి.. మరో వైపు కిన్నెరసాని, మున్నేరు, తదితర ఏరులు, వాగులతో పాటు వ్యవసాయబావులు, బోర్ల ద్వారా పుష్కలంగా జలసంపద ఉన్నా వాటిని పూర్తిస్థాయిలో సాగుకు మళ్లించే అవకాశాలు లేకపోవడంతో యాసంగిలో సగం భూములు బీళ్లుగానే మిగులుతున్నాయి. వానాకాలంలో పూర్తిగా పచ్చల హారాన్ని తలపించే భూములు కాస్తా.. ఎండాకాలం రాగానే బీళ్లుగా కనిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమకాలువ ఆయకట్టు, భద్రాద్రి జిల్లాలో చర్లలోని తాలిపేరు ఆయకట్టులో మాత్రమే వేసవి పంటలు సాగవుతున్నాయి. దానికి తోడు బోర్లు, బావులు, చెరువులు, ఎత్తిపోతల పథకాలు ఉన్న చోట మాత్రమే రైతులు పంటలు సాగుచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 10లక్షల ఎకరాలపైగా సాగు భూమి ఉండగా.. వానాకాలంలో వరి, మిర్చి, పత్తితోపాటు జొన్న, మినుము, వేరుశనగ, తదితర పంటలు పండిస్తున్నారు. వేసవికాలం వచ్చేసరికి నీటి సదుపాయం ఉన్న చోట మిర్చి, పత్తి లాంటి పంటలకు నీరు అందిస్తుండగా కొన్ని చోట్ల వరి వేస్తున్నారు. ఈ క్రమంలో వేసవిలో ఉమ్మడిజిల్లా మొత్తంగా సుమారు లక్షన్నర ఎకరాలు సాగవుతుంది. అయితే వానాకాలం పంటలు పండిన భూముల్లో సంగం ప్రస్తుతం బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాకు పొరుగున ఉన్న కృష్ణ, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో రెండు మూడు పంటలు పండిస్తున్నారు. కృష్ణా, గోదావరి జలాలతో అన్ని కాలాల్లో అక్కడ పంటలు పండిస్తుంటే పొరుగున ఉన్న ఖమ్మంజిల్లాలో వానాకాలం మాత్రమే కళకళలాడుతోంది. అన్ని పంటలకు అనువైన వాతావరణం, నేలలు, తెలివైన రైతులు, సమృద్ధిగా నీరున్నా సాగుకు మళ్లించలేకపోతుండటంతో రైతులు పూర్తిస్థాయిలో సాగు చేయలేకపోతున్నారు. వానాకాలంలో తొలకరి వర్షాలకు పంటలు వేయడం, తమకున్న నీటి వనరులతో పాటు బావులు, బోర్ల నీటిని మళ్లించి జనవరి, ఫిబ్రవరి వరకు పంటలకు నీరు ఇస్తూ కాపాడుకుంటున్న జిల్లా రైతులు ఒక పంట పూర్తికాగానే రెండో పంటను మళ్లీ వేయలేని పరిస్థితి. ప్రాజెక్టులతోనే మహర్దశ..ఉమ్మడి జిల్లా భూములకు సాగునీరు అందించేందుకు రూ.15వేల కోట్లతో గోదావరిపై చేపట్టిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు ఐదేళ్లుగా కొనసాగుతున్నాయి. ఇది పూర్తయితే వర్షాకాలంలో గోదావరి నుంచి వృథాగా పోయే లక్షల క్యూసెక్కుల నీరు పంటల సాగుకు ఉపయోగపడుతుంది. నవంబరు వరకు గోదావరి ప్రవాహం ఉంటుంది. సీతారామ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ఉమ్మడి జిల్లాలోని ఏరులు, వాగులు, చెరువులకు మళ్లించడం, పాలేరు జలాశయానికి గోదావరిని అనుసంధానం చేయడం ద్వారా భూగర్భజలాలు పెరిగి బోర్లు, బావులు ద్వారా చెక్‌డ్యాంల ద్వారా సాగునీటి సదుపాయం పెంచుకోవడంతో పాటు యాసంగిలోనూ సాగుకు వినియోగించే అవకాశం ఉంటుంది. గతేడాది వానాకాలానికే సీతారామ నీరు వదులాతామని ప్రభుత్వం చెప్పినా ఈ ఏడాది వానాకాలంలో కూడా అది సాకారం కాలేదు. వచ్చే వానాకాలానికి అందుతుందన్న నమ్మకం లేదు. కాలువల పనులు పూర్తికాకపోవడం, లిఫ్టుల పనులు కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. పనులు పూర్తవ్వాలంటే మరో ఏడాదిన్నరపైగా పట్టే అవకాశం కనిపిస్తోంది. అలాగే ఉమ్మడిజల్లాలోని పలు ఏరులు, వాగులకు చెక్‌డ్యాంలు నిర్మించడం ద్వారా వానాకాలంలో నీటిని వృథా కానివ్వకుండా నిల్వ చేసుకుని.. ఆ నీటిని వేసవిలో పంటలకు ఉపయోగించే వీలుంటుంది. ప్రాజెక్టులు, చెక్‌డ్యాంల నిర్మాణం పూర్తయితే మహర్దశ వస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

# సీఎంఆర్‌ను పక్కదారి పట్టిస్తున్న మిల్లర్లు



పెద్దపల్లి : సీఎంఆర్‌ను కొందరు రైస్‌మిల్లర్లు పక్కదారి పట్టిస్తున్నారు. సకాలంలో ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించకుండా బయట మార్కెట్‌లో విక్రయించు కుంటున్నారు. ప్రభుత్వానికి తామిచ్చే బియ్యానికి గడువు కోరుతూ సీజన్ ధాన్యం వచ్చేవరకు తప్పిం చుకు తిరుగుతున్నారు. ఈక్రమంలో కొందరు మిల్ల ర్లు మొత్తానికే ప్రభుత్వానికి బియ్యం ఇచ్చే పరిస్థితి కనబడడం లేదు. అయినా అధికారు లు ఇంకా చర్యలు చేపట్టడం లేదు. ఇటీవల సుల్తానాబాద్ మండలం పూసాల గ్రామంలోగల లక్ష్మి నర్సింహా ఇండస్ట్రీ రైస్ మిల్ యజమానులు 5 కోట్ల 95 లక్షల 98 వేల రూపాయల విలువైన 21 వేల క్వింటాళ్ల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి లెవీ కింద ఇవ్వాల్సి ఉండగా ఆ బియ్యా న్ని పక్కదారి పట్టించిన విషయం తెలి సిందే. దీంతో సివిల్ సప్లయ్ అధికారులు సుల్తా నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిల్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని పలు మిల్లర్లు గడిచిన మూడు, నాలుగు నెలల్లో సివిల్ సప్లయ్ అధికారుల అండదండలతో కాకినాడ పోర్టుకు కొన్ని టన్నుల బియ్యాన్ని తరలిం చారనే అనుమానాలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎఫ్‌సీఐ అధికారులు మూకుమ్మడిగా సుల్తానాబాద్ ప్రాంతంలో ఉన్న రైస్ మిల్లులను తనిఖీలు చేపట్టారు. వారికి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం ఎంత, వాళ్లు కొనుగోలు చేసిన ధాన్యం ఎంత, సీఎంఆర్ పూర్తి చేశారా, లేదా అనే వివరాలను సేకరిస్తున్నారు. కొందరు మిల్లర్ల వక్రబుద్ధి.. జిల్లాలో 210కి పైగా పార్‌బాయిల్డ్, రా‌రైస్ మిల్లులున్నాయి. ఈ మిల్లులకు ప్రభుత్వం రైతుల వద్ద కోనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయిస్తూ వస్తున్నది. జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యమే గాకుండా జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, ఇతర జిల్లాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని మిల్లులకు కేటాయిస్తున్నారు. ఏడాదంతా మిల్లులు నడిచే విధంగా ప్రభుత్వం ధాన్యం కేటాయింపులు చేస్తున్నప్పటికీ, కొందరు మిల్లర్లు వక్రబుద్ధితో బయటి మార్కెట్‌కు బియ్యాన్ని తరలిస్తున్నారు. 2019-20 యాసంగికి సంబంధించి 29 వేల టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి లెవీ కింద ఇవ్వడంలో 36 రైస్‌మిల్లుల యజమానులు జాప్యాన్ని ప్రదర్శించారు. ఆయా మిల్లులను తనిఖీ చేసిన అధికారులు గడువుల మీద గడువులు ఇవ్వడంతో 22 రైస్‌మిల్లుల యజమానులు 20 వేల టన్నుల వరకు బియ్యం ఇచ్చారు. ఇంకా 9 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని 14 రైస్ మిల్లుల యజమా నులు ఇవ్వాల్సి ఉన్నది. ఇందులో మూడు మిల్లుల యజమానులు చేతులెత్తేసే పరిస్థితి ఉందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ వారిపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 2020-21 యాసం గికి సంబంధించి ఇంకా 40 వేల టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సి ఉన్నది. ఏడాది గడుస్తున్నా కూడా మిల్లర్లు ధాన్యాన్ని వేగంగా మర ఆడించి బియ్యం ఇవ్వక పోయినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. 2021-22 వానాకాలం పంటకు సంబంధించి 1,80,000 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉన్నాయి. ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేయడం ద్వారా మిల్లర్లకు లాభాలు ఉన్నప్పటికీ, తమ అవసరాలను తీర్చుకునేందుకు తాత్కాలికంగా తమ వద్ద ఉండే ప్రభుత్వ ధాన్యాన్ని బియ్యంగా మార్చి బయటి మార్కెట్‌కు తరలిస్తున్నారు. నామమాత్రంగా తనిఖీలు..గతంలో బియ్యాన్ని ఎగుమితి చేయాలంటే ఖచ్చితంగా సివిల్ సప్లయ్ అధికారుల నుంచి పర్మిట్లు తీసుకునే నిబంధన ఉండేది. కానీ ప్రస్తు తం ఎలాంటి పర్మిట్లు లేకుండా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేసి బియ్యంగా మార్చి ఎక్కడైనా విక్ర యించుకునే వెసులుబాటు ఉన్నది. దీనిని తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. ఆరు మాసాల కోసారి వరి పంటలు కోతకు వస్తాయి కాబట్టి కొత్త ధాన్యం వచ్చే లోగా తమ వద్ద ఇదివరకే ఉన్న ధాన్యాన్ని బియ్యంగా మార్చి బయట విక్రయించు కుంటున్నారు. మిల్లర్లకు ప్రభుత్వం ఎలాంటి గ్యారంటీలు, బీమా లేకుండానే ధాన్యాన్ని ఇవ్వడం కూడా వారికి కలిసివస్తున్నది. క్షేత్రస్థాయి లో ఉండే సివిల్ సప్లయ్ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. తనిఖీల సమయంలో ఆయా మిల్లుల్లో ధాన్యం లేకున్నా కూడా ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో చేతులు మారుతున్నట్లు తెలుస్తు న్నది. రాష్ట్ర సివిల్ సప్లయ్ అధికారుల తీరుపై అనుమానాలు రావడంతో నేరుగా ఎఫ్‌సీఐ అధికారులు రంగంలోకి దిగి మిల్లులను తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీల్లో ఏ మేరకు అక్రమాలు బయట పడతాయో వేచిచూడాల్సిందే.

# కమిషనర్ సారు.. కనికరించరూ!



ఖమ్మం : ప్రభుత్వ శాఖల్లో పనిచేసేఉద్యోగులకు ఎవరికైనా ఒకటి రెండు నెలలు జీతాలు ఆగితే గగ్గొలు పెట్టే పరిస్థితి. అలాంటిది ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖలో ఏకంగా రెండున్నరేళ్లుగా జీతాలు ఇవ్వకుండా పనులు చేయించుకుంటున్నారు అధికారులు. జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన 11పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో పనిచేస్తున్న 47 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 2019 సెప్టెంబరు నుంచి జీతాలు ఇవ్వకపోవడం గమనార్హం. కాగా దానికి సంబంధించి ఖమ్మం ఐటడీఏ డీడీ కార్యాలయం చుట్టూ, కమిషనరేట్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా జీతాలు రాకపోకవడంతో ఇల్లు గడిచే పరిస్థితి కూడా లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారుల తప్పిదాలతో వివాదం..గతంలో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పనిచేసే కార్మికులకు రోజువారీ కూలీ పద్ధతిలో చెల్లింపులు జరిపగా.. ఆ సమయంలో ఒక్కొక్కరికి రూ.3వేల నుంచి రూ.5వేలు మాత్రమే వేతనాలు అందించేవారు. దాని వల్ల సిబ్బంది ఎక్కువ సమయం హాస్టళ్ల వద్ద కేటాయించేవారు కాదు. దాంతో హాస్టళ్లలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారనే ఉద్దేశంతో ఆయా పోస్టులను అవుట్‌సోర్సింగ్ ద్వారా భర్తీ చేసి రూ.12వేలు వేతనాన్ని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.తద్వారా హాస్టళ్లలో పరిశుభ్రత, వంట ఇతరత్రా సక్రమంగా ఉంటాయని భావించింది. దీంతో జిల్లాలో గిరిజన విద్యార్థులు ఉండే హాస్టళ్లలో, గిరిజన సంక్షేమ శా ఖ పరిధిలో పనిచేసేందుకు గాను సంబంధిత శాఖ అధికారులు అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీలను టెండర్లకు పిలిచారు. అలా టెండర్లలో ఓ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి సిబ్బంది నియమించే బాధ్యత అ ప్పగించారు. అయితే అందులో అధికారులు చేసిన తప్పిదంకాస్త ప్రస్తుతం కార్మికులకు శాపంగా మా రింది. ఒప్పందం ప్రకారం జిల్లాలో సెక్యూరిటీ గార్డులు, అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వాచ్‌మెన్‌లాంటి పోస్టుల్లో సిబ్బందిని నియమించాలని ఉందని, కాగా ఆయా పోస్టులు లేకపోయినా.. ఉన్న వాటిల్లో తాము చెప్పిన సిబ్బందినే నియమించుకోవాలని చెప్పారని, అధికారులు రోస్టర్ విధానాన్ని పాటించకపోవడం, 25 మందికి పైగా ఇతర జిల్లాల వారికి కూడా ఇక్కడే పోస్టింగ్‌లు ఇవ్వడం లాంటి కారణాలతో ఏజెన్సీ వారికి, సంబంధిత శాఖ అధికారులకు మధ్య వివాదం ఏర్పడింది. దాంతో సంబంధిత ఏజెన్సీ వారు 2017 నవంబరులో కోర్టును ఆశ్రయించారు. వేతనాల కోసం కార్మికుల ప్రదక్షిణలు..మొదటి ఏజెన్సీ వారు కోర్టును ఆశ్రయించడంతో ఆ బాధ్యతలను మరొక ఏజెన్సీకి అప్పగించారు అధికారులు. అయితే మొదటి ఏజెన్సీ వారు 2017 నవంబరులో కోర్టును అశ్రయించగా.. ఆ తర్వాత కొద్దిరోజులపాటు జీతాలు సర్ధుబాటు చేసిన సంబంధిత శాఖ అధికారులు 2019 ఏప్రిల్ నుంచి జీతాలు ఇవ్వడం ఆపేశారు. కానీ ఆయా కార్మికులతో మాత్రం హాస్టళ్లలో పనులు చేయించుకుంటూనే ఉన్నారు. అలా జిల్లాలో 11 పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో 47మంది సిబ్బందికి అప్పటి నుంచి జీతాలు ఇవ్వని పరిస్థితి నెలకొంది. అలా సుమారు రూ.3కోట్ల వరకు జీతాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఓ ఏడుగురు కార్మికులు విధులు మానేసినట్టు సమాచారం. ఆయా వేతనాల కోసం ఖమ్మం కలెక్టరేట్‌లోని ఐటీడీఏ డీడీ కార్యాలయానికి ప్రదక్షిణలు చేస్తున్నారు సదరు కార్మికులు. కొద్ది రోజుల క్రితం సంబంధిత కార్మికులు కమిషనరేట్‌కు వెళ్లి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయినా సంవత్సరాల గడుస్తున్నాయి కానీ వారికి జీతాలు మాత్రం రావడంలేదు. కాగా కళాశాల వసతి గృహాల్లో పనిచేసే కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నమాట వాస్తవమేనని, వారికి సంబంధించి బడ్జెట్ రాగానే వేతనాలు ఇస్తామంటూ జిల్లా అధికారులు చెప్పడం గమనార్హం. కానీ దానిపై ఎప్పుడు వస్తాయనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ జీతాలకు సంబంధించిన బడ్జెట్‌ను విడుదల చేయాలని ఆ కార్మికులు కోరుతున్నారు.

# మూడు గ్రంథాలయాలకు ఒక్కడే..

ఖమ్మం : పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూర్‌లలో ఉన్న మూడు గ్రంథాలయలకు ఒక్కరే నిర్వహుకులు ఉండడం తో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ప్రకటనలు జారీ చేసింది. కోచింగ్ తీసుకోలేని వారు గ్రంథాలయాలను ఉపయోగించుకుంటారు. కాని గ్రంథాలయాలు మూసి ఉండటంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిరుద్యోగులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచాల్సిన గ్రంథపాలకు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రంథాలయంలో నిర్వహులు ఉంటే నిరుద్యోగులకు అవసరమై పుస్తకలను అడిగి తీసుకోవచ్చు కాని ఒక్కొక్క నిర్వహుకునికి మూడు గ్రంథాలయాలను అప్పగిస్తే వారు ఎక్కడ ఎవరికి న్యాయం చేస్తారని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పోలీసు, గ్రూప్ 1 ఉద్యోగప్రకటనలు వెలువడ్డాయి. గ్రంథపాలకు ఉంటే ఉదయం 8గంటలనుంచి 11 గంటల వరకు సాయంత్రం 3గంటలనుంచి 6గంటల వరకు గ్రథాలయని తెరచి ఉంచుతారు. కాని ఇన్‌చార్జీలతో వారంకు ఒక రోజు, నెలకు ఒక్కరోజు వస్తే ఫలితం ఎమిటని నిరుద్యోగులు అంటున్నారు. పెనుబల్లి గ్రంథపాలకుడికి సత్తుపల్లి, వేంసూర్ ఇన్‌చార్జీ భాద్యతలు అప్పగించడంతో వారనికి ఒకరోజు పెనుబల్లికి, నెలకు ఒకరోజు వేంసూర్, మిగిలిన సమయంలో సత్తుపల్లి లలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఎక్కడ కూడ ఎవరికి న్యాయం జరగడం లేదని నిరుద్యోగులు ఆవేదనవ్యక్తంచేస్తున్నారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సొంత నియోజక వర్గంలోనే ఇద్దరు నిర్వాహకులు ఆరు గ్రంథాలయాలను నిర్వహిస్తున్నారు. ప్రతీ గ్రంథాలయానికి గ్రంథపాలకుడిని నియమించాల ని నిరుద్యోగులు కోరుతున్నారు.

# మళ్లీ సారా కోరలు

ఖమ్మం : గుట్టుచప్పుడు కాకుండా కొందరు గుడుంబా తయారీ, విక్రయాలు సాగిస్తున్నారనడానికి కొద్ది రోజులుగా ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నవే నిదర్శనంగా నిలుస్తున్నాయి. పునరావాసం లేకపోవడంతోనేనా..?సారా కారణంగా వందల కుటుంబాల రోడ్డున పడుతున్నాయని భావించిన ప్రభుత్వం దానిపై ఉక్కుపాదం మోపేందుకు పలు రకాల చర్యలు చేపట్టింది. ఎక్సైజ్ శాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. నాటుసారాకేసుల్లో పట్టుబడిన వారికి పునరావాసం కల్పించడం ద్వారా దానిని నియంత్రించడం సులువవుతుందని భావించింది. అయితే మొదట్లో పెద్ద ఎత్తున దానిపై ప్రచారం చేసిన ప్రభుత్వం ఆ తర్వాత పూర్తిస్థాయిలో పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేసింది. దాంతో గ్రామీణ ప్రాంతాల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. గతంలో సారా కేసుల్లో పట్టుబడిన వారు.. మళ్లీ అదే పనిచేయకుండా ఉండేందుకుగాను ప్రభుత్వం ఆయా వ్యక్తులకు తగ్గట్టుగా కిరాణా, డెయిరీ లాంటి పలు రకాల యూనిట్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తూ ఒక్కో యూనిట్‌కుగాను రూ.2లక్షలు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించి. అందులో భాగంగా జిల్లా అధికారుల నుంచి అర్హుల జాబితాను సైతం తీసుకుంది. అలా ఖమ్మం జిల్లాలో మొదటి విడతలో 2,500 మంది అర్హుల జాబితా పంపగా.. అందులో 455 మందికి మాత్రమే యూనిట్లను మంజూరు చేసి పునరావాసం కల్పించారు. అనంతరం రెండోసారి అర్హుల జాబితా అడగ్గా మరో 1500 మంది జాబితాను అధికారులు పంపించగా.. వారిలో అసలు ఎవరికీ పరిహారం అందలేదున మొత్తంగా జిల్లాలో 4వేల మంది అర్హుల జాబితా పంపితే కేవలం 455 మందికే యూనిట్లు అందాయి. ఈ క్రమంలో గడిచిన మూడేళ్లలో కనీసం దాని ఊసెత్తిన దాఖలాలు లేవు. దాంతో ఇన్నాళ్లు తమకు ఏదో ఒక ఆసరా దొరుకుతొందని ఎదురుచూసిన వారు ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తిరిగి సారా తయారీ వైపు చూస్తున్నట్టు తెలుస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లోనే అధికం...అయితే ఇన్నాళ్లు ప్రతి పల్లెలోనూ నాటుసారా తయారీ, విక్రయాలు జోరుగా సాగేవి. అయితే ప్రభుత్వం పునరావాసం కల్పిస్తామంటూ ప్రకటించడంతో మెల్లగా ఆయా తయారీ తగ్గిపోతూ వచ్చింది. అయితే ప్రభుత్వం కొన్నేళ్లుగా ఎలాంటి లబ్ధి చేకూర్చకపోవడంతో తిరిగి అదేబాట పడుతున్నారు తయారీదారులు. ఇటీవల ఎక్సైజ్ శాఖ అధికారులు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడిన వారిని పరిశీలిస్తే అత్యధికంగా ఏజెన్సీల్లోనే ఈవ్యవహారం ఎక్కువగా సాగుతున్నట్టు తెలుస్తోంది. పలు ఏజెన్సీ గ్రామాల్లో అధికారులు బెల్లంఊటను ధ్వంసం చేసిన సంఘటనలు ఇటీవల ఉన్నాయి. మున్ముందు కూడా ఇదే పరిస్థితి కొనసాగితే మళ్లీ పాతరోజుల్లా సారా ఏరులైపారే అవకాశం కనిపిస్తోంది.ప్రస్తుతం అధికారులు కూడా సారాను కట్టడి చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. అందులో భాగంగానే గుడుంబా తయారీ దారులెవరైనా పట్టుబడితే భారీస్థాయిలో జరిమానాలు విధిస్తూ వస్తున్నారు. అలా ఒకే నెల వ్యవధిలో రెండు మండలాల్లో ఐదుగురు వ్యక్తులకు రూ.లక్ష చొప్పున రూ.5 లక్షలు



జరిమానా విధించడం గమనార్హం. రూ.లక్ష జరిమానా విధించిన వారి వివరాలివే...కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన వాంకుడోత రాందాసు గుడుంబా తయారుచేసి విక్రయిస్తూ పలుమార్లు పట్టుబడ్డా డు. అయినా ఆయన తయారీని ఆపకపోవడంతో ఎక్సైజ్ అధికారులు రూ. లక్ష జరిమానా విధించారు. అదే తండాకు చెందిన రాందాసు పేరున్న మరో వ్యక్తికి కూడా రూ.లక్ష జరిమానా వేశారు. ఏన్కూరు మండలం గార్లొడ్డుకు చెందిన రామారావు 2021లో సారా అమ్ముతూ పట్టుపడగా ఎక్సైజ్ అధికారులు కేసునమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. కాగా తాజాగా ఈఏడాది మార్చి 23న మళ్లీ సారా అమ్ముతూ పట్టుబడగా.. రూ.లక్ష జరిమానా విధించారు. కారేపల్లి మండలం గుంపెళ్లగూడేనికి చెందిన బానోత మంగ, అంగోత కుమారి సారా విక్రయిస్తున్నార్న సమాచారంతో గతంలో బైండోవర్ కేసు నమోదు చేశారు. కానీ మళ్లీ ఫిబ్రవరి 7న సారా విక్రయిస్తూ దొరకడంతో ఆ ఇద్దరికి రూ.లక్ష చొప్పున రూ.2లక్షల జరిమానా వేశారు.



బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తదితరులు పార్లమెంట్ హౌస్ ఆవరణలోని ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు.

## వివక్షని రూపుమాపేందుకు అంబేద్కర్ జీవితాంతం ఓ యుద్ధమే చేశారు



అమరావతి : స్వతంత్ర సమరయోధుడు, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నానని ట్విటర్ వేదికగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వెల్లడించారు. సమాజంలో ఆధిపత్య ధోరణులపై అంబేద్కర్ అలుపెరుగని పోరాటం చేశారన్నారు. వివక్షని రూపుమాపడానికి జీవితాంతం ఓ యుద్ధమే చేశారన్నారు. స్వేచ్ఛా, సమానత్వం, పౌరహక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించిన మానవతామూర్తి అంబేద్కర్ మహాశయుడి ఆశయసాధనకి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వివక్ష, పేదరికం లేని సమాజం నిర్మించుదామని నారా లోకేష్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

## నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా.. చంద్రబాబుకు కొడాలి నాని సవాల్



కృష్ణా జిల్లా: రాష్ట్ర ప్రజలు చంద్రబాబును విశ్వసించే పరిస్థితి లేదని మాజీ మంత్రి కొడాలి నాని అన్నారు. 2019లో వచ్చిన ఫలితాలే 2024లో రిపీట్ అవుతాయన్నారు. శుక్రవారం ఆయన గుడివాడలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రానికి చంద్రబాబు చేసింది ఏమీలేదన్నారు. గుడివాడలో 23 వేల మంది పేదలకు ఇళ్లు ఇస్తున్నాం. గుడివాడ అభివృద్ధిపై చంద్రబాబుతో చర్చకు నేను సిద్ధం" అంటూ సవాల్ విసిరారు. "చంద్రబాబు 14 ఏళ్లు గుడివాడను గాలికి వదిలేశారు. ఇప్పుడు సిగ్గులేకుండా వచ్చి అవాస్తవాలు మాట్లాడుతున్నారు. ఎప్పుడూ లేని విధంగా ప్రస్తుతం గుడివాడలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

గుడివాడకు చంద్రబాబు ఏం చేశారు? గుడివాడలో చంద్రబాబు ప్రచారం చేసిన ప్రతిసారి టీడీపీ ఓడిపోయింది. పేదల ఇళ్ల కోసం చంద్రబాబు ఒక్క ఎకరం కొన్నట్లు నిరూపించగలరా?. చంద్రబాబు నిరూపిస్తే నేను రాజకీయాలు వదిలేస్తా. చంద్రబాబు జిత్తులమారి నక్క" అంటూ కొడాలి నాని దుయ్యబట్టారు. "సభలో ఖాళీ కుర్చీలకు చంద్రబాబు ఉపన్యాసం ఇచ్చారు. ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలు కూడా చంద్రబాబు పెట్టలేదు. మేము పెట్టిన విగ్రహాలకు చంద్రబాబు దండలు వేశారు. హరికృష్ణ ఎంపీగా ఉన్నప్పుడు నిమ్మకూరును అభివృద్ధి చేశారు. హరికృష్ణ, జూనియర్ ఎన్టీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధి చంద్రబాబుకు లేదు. నిమ్మకూరును ఉద్ధరించామని చెబితే ఎవరు నమ్ముతారు?" అంటూ కొడాలి నాని నిప్పులు చెరిగారు.

## 151 అడుగుల స్టిక్కర్లను అంటిస్తారా?...
## రుషికొండ తవ్వకాలపై పవన్ సెటైరికల్ ట్వీట్



అమరావతి: రుషికొండ తవ్వకాలపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ సెటైరికల్ వ్యాఖ్యలు చేశారు. రుషికొండ తవ్వకాలను కప్పి పుచ్చేందుకు 151 అడుగుల స్టిక్కర్లను అంటిస్తారా అంటూ ట్విట్టర్‌లో సెటైర్ వేశారు. చెట్లు, కొండలను నరికివేయడం, తీరప్రాంతాలు, మడ అడవులను పాడు చేయడం అనేది వైసీపీ దుష్ట పాలకుల ముఖ్య లక్షణమని విమర్శించారు. రుషికొండను ధ్వంసం చేయడంలో వైసీపీ ప్రభుత్వం నిబంధనలను ఉల్లంఘించిందని ఐదుగురు సభ్యుల నిపుణుల ప్యానెల్ నిర్ధారించిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం సమాధానం చెబుతుందా లేక రుషికొండ గ్రీన్ మ్యాట్‌పై 151 అడుగుల స్టిక్కర్‌ను అంటిస్తారా? అంటూ పవన్ ట్వీట్ చేశారు. రుషికొండ తవ్వకాలు నిబంధనలు విరుద్ధంగా జరుగుతున్నాయంటూ విశాఖ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జనసేన నేత మూర్తి యాదవ్ గత ఏడాది అక్టోబర్‌లో హైకోర్టులో పిటిషన్ వేయగా.. అనేక మార్లు విచారణకు వచ్చింది.

రుషికొండలో 9 ఎకరాల్లో మాత్రమే తవ్వకాలు జరపాలన్న నిబంధనలు తుంగలో తొక్కిన వైసీపీ సర్కార్ దాదాపు 20 ఎకరాలు తవ్వేసిందని పిటిషన్లలో పేర్కొన్నారు. ఈ క్రమంలో తవ్వకాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఓ కమిటీని ధర్మాసనం నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ రుషికొండలో క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రెండు రోజుల క్రితం హైకోర్టులో మరోసారి విచారణకు రాగా.. తవ్వకాలకు సంబంధించి నివేదికను కేంద్ర కమిటీ హైకోర్టుకు సమర్పించింది. దీంతో కౌంటర్ చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

## సీఎం, రాష్ట్ర ప్రభుత్వానికి అభినందనలు తెలిసిన వైసీపీ రెబల్ ఎమ్మెల్యే



నెల్లూరు: బరాషాహిద్ దర్గా అభివృద్ధి పనులకు ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. బరాషాహిద్ దర్గా అభివృద్ధి, మసీదు నిర్మాణం కోసం రూ.15 కోట్లు నిధులు కేటాయిస్తూ జీవో జారీ చేసి జాప్యం చేశారన్నారు. 9 నెలలు అయినా ఆర్థిక శాఖ అనుమతులు లేవని నిలిపేశారని... 6 నెలల పాటు ప్రభుత్వం పెద్దల చుట్టు తిరిగినట్లు తెలిపారు. నాలుగు సార్లు టెండర్లు పిలిచినా ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదన్నారు. వారం రోజుల నుంచి ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో దర్గా కోసం ఉద్యమం చేపడితే నెరవేరుతుందని శ్రీకారం చుట్టామని.. తమ ప్రయత్నంతో విజయం సాధించామన్నారు. రాత్రి దర్గా అభివృద్ధి పనులకు ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చిందన్నారు. ఇది తన విజయం కాదని నెల్లూరు ముస్లిం సోదరుల పోరాటమని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు.

## లోకేశ్ అరికాలికి బొబ్బలు .. జేసీ ప్రభాకర్‌రెడ్డి కంటతడి



తాడిపత్రి: తెదేపా మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అరికాలి బొబ్బలను తలచుకుని ఆయన కంటతడి పెట్టారు. ప్రజలు, రాష్ట్రం కోసం లోకేశ్ పాదయాత్ర చేస్తున్నారని.. ఆయన సతీమణి, తల్లిదండ్రులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని జేసీ వ్యాఖ్యానించారు. "పాదయాత్రలో రెండు రోజులు పాల్గొంటేనే నా కుమారుడికి కాళ్లు నొప్పులు వచ్చాయి. ప్రజల కోసం లోకేశ్ వందల కిలోమీటర్ల పాదయాత్ర చేస్తున్నారు. తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌ను చూసినట్టుగా జనం లోకేశ్‌ను చూస్తారు" అని జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు.




లండన్: ప్రపంచాన్ని కరోనా వైరస్ అతలాకుతలం చేసింది. చైనాలో వెలుగులోకి వచ్చిన ఈ మహమ్మారి లక్షలాది మందిని పొట్టనబెట్టుకుంది. ఇప్పటికీ ప్రపంచంలో ఏదో ఒక మూల కొత్త రూపం సంతరించుకొని మానవాళిని భయపెడుతూనే ఉంది. అయితే, లండన్ కేంద్రంగా జరిగిన ఓ తాజా పరిశోధన మరో ఆసక్తికర అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. వచ్చే పదేళ్లలో కొవిడ్ తరహా మహమ్మారి మరోసారి ప్రపంచాన్ని చుట్టుముట్టే ప్రమాదం ఉందని హెచ్చరించింది. వచ్చే దశాబ్ద కాలంలో దాదాపు కరోనా వైరస్‌కు ఉన్నంత తీవ్రతతో మరో మహమ్మారి వచ్చే అవకాశం 27.5% ఉన్నట్లు ఆరోగ్య విశ్లేషణా సంస్థ 'ఎయిర్‌ఫినిటీ లిమిటెడ్' వెల్లడించింది. వాతావరణ మార్పులు, అంతర్జాతీయ ప్రయాణాలు పెరగడం, జనాభా పెరుగుదల, జంతువుల నుంచి మనుషులకు సోకే సామర్థ్యం ఉన్న కొత్త వ్యాధులు పుట్టుకు రావడం వంటి కారణాలు అందుకు దోహదం చేస్తాయని పేర్కొంది. అయితే, 100 రోజుల్లోగా సమర్థమైన వ్యాక్సిన్లను ఆవిష్కరించగలిగితే.. వాటిని నివారించే అవకాశం ఉంటుందని తెలిపింది. మనిషి నుంచి మనిషికి వ్యాపించేలా పరివర్తన చెందగలిగే అవకాశం ఉన్న బర్డ్‌ఫ్లూ తరహా వైరస్‌లు వెలుగులోకి వస్తే.. యూకేలో ఒకే రోజు 15,000 మంది మరణించే ప్రమాదం ఉంటుందని ఎయిర్‌ఫినిటీ తెలిపింది. భారత్‌లో ఇప్పటికే సార్స్, మెర్స్, కొవిడ్–19 మహమ్మారులు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా హెచ్5ఎన్1 బర్డ్‌ఫ్లూ స్ట్రెయిన్ ఆందోళన కలిగిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనివల్ల చాలా తక్కువ మంది మాత్రమే అనారోగ్యానికి గురయ్యారు. అలాగే ఇది ఒక మనిషి నుంచి మరో మనిషికి వ్యాప్తిస్తున్నట్లు ఇప్పటి వరకు ఆధారాలు లేవు. అయితే, పక్షుల్లో వేగంగా వ్యాప్తి చెందడం, క్షీరదాలకూ వ్యాప్తిస్తుండడం ఇప్పుడు పరిశోధకులను కలవరపెడుతోంది. పరివర్తనలు ఇలాగే కొనసాగితే.. వేగంగా వ్యాపించేలా వైరస్ రూపాంతరం చెందే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. మెర్స్, జికా వంటి వ్యాధులకు కారణమవుతున్న వైరస్‌లను నిలువరించేందుకు ఇప్పటి వరకు నిర్దిష్టమైన టీకాలు, చికిత్స విధానాలు అందుబాటులో లేవని ఎయిర్‌ఫినిటీ గుర్తు చేసింది.

అలాగే ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాల వల్ల కొత్త వైరస్‌ల ముప్పును వెంటనే పసిగట్టడం అంత సులభం కాదని పేర్కొంది. ఈ నేపథ్యంలో మరో కొత్త మహమ్మారిని ఎదుర్కోవడానికి ప్రభుత్వాలు సన్నద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించింది.




కడప: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డిని సీబీఐ అరెస్ట్ చేసింది. అనంతరం అతడిని హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టులో హాజరుపరిచేందుకు కడప నుంచి తరలిస్తోంది. తొలుత గూగుల్ టేక్‌అవుట్ ద్వారా ఎంపీ తండ్రి భాస్కర్‌రెడ్డి ఇంట్లో ఉదయ్ ఉన్నట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది. శుక్రవారం ఉదయం పులివెందులలో అతడిని అదుపులోకి తీసుకుని కడప కారాగారం అతిథిగృహానికి తీసుకెళ్లి విచారించింది. అనంతరం ఉదయ్‌ను అరెస్ట్ చేసినట్లు సీబీఐ అధికారులు ఆయన కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మరోవైపు ఉదయ్ తండ్రి జయప్రకాశ్‌రెడ్డిని కూడా సీబీఐ అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు అవినాష్, శివశంకర్ రెడ్డితో పాటు ఘటనాస్థలికి ఉదయ్ వెళ్లినట్లు.. ఆ రోజు అంబులెన్స్, ఫ్రీజర్, వైద్యులను రప్పించడంలో కీలక పాత్ర పోషించినట్లు సీబీఐ భావిస్తోంది. వివేకా మృతదేహానికి ఉదయ్ తండ్రి జయప్రకాశ్ రెడ్డి బ్యాండేజ్ కట్లు కట్టినట్లు ఆరోపణలున్నాయి. ఉదయ్‌ను గతంలో పలుమార్లు సీబీఐ అధికారులు విచారించారు.




విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీ వద్ద మరోసారి ఉద్రిక్తత నెలకొంది. వర్సిటీలో కొంత మేర ప్రభుత్వ స్థలంగా గుర్తించినట్లు తెలిపిన రెవెన్యూ అధికారులు.. కంచె నిర్మాణం చేపడుతున్నారు. పోలీసు బందోబస్తు మధ్య కంచె నిర్మాణ సామాగ్రితో వర్సిటీలోకి రెవెన్యూ సిబ్బంది వెళ్లారు. ప్రధాన క్యాంపస్‌లోని డెంటల్ కాలేజ్ వద్ద కిలోమీటర్ మేర కంచె వేస్తున్నారు. ఆర్డీవో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. కంచె ఏర్పాటు నేపథ్యంలో తెల్లవారుజా మున 2 గంటల నుంచే గీతం వర్సిటీకి వెళ్లే అన్ని రోడ్లపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఎండాడ, రుషికొండ మార్గంలో సుమారు రెండు కిలోమీటర్ల ముందుగానే బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఐడీ కార్డులు చూపిస్తేనే స్థానికులను ఆ మార్గంలో పంపిస్తున్నారు. పోలీసుల ఆంక్షలతో చుట్టు పక్కల ప్రజలు, కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ఏసీపీ మూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు జరిగాయి. ఈ ఏడాది జనవరిలోనూ గీతం కళాశాలను ఆనుకొని ఉన్న 14 ఎక రాల భూమిని ప్రభుత్వ అధికారులు స్వాధీనపరుచుకున్న విషయం తెలిసిందే.

**గీతంలో కంచె వేస్తే చుట్టు పక్కల బారికేడ్లు ఎందుకు?: గండి బాబ్జీ**

– గీతం విశ్వవిద్యాలయంపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు కొనసాగుతోందని తెదేపా నేత, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ ఆరోపించారు. కంచె ఏర్పాటు విషయం తెలుసుకున్న ఆయన.. గీతం కాలేజ్ ప్రాంగణం వద్దకు వచ్చారు. సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఈ సందర్భంగా పోలీసులను ఆయన కోరారు. అనంతరం మీడియాతో గండి బాబ్జీ మాట్లాడుతూ.. నిజంగా ప్రభుత్వ భూమి ఉంటే ఒకేసారి తీసుకోవాలి తప్ప ప్రతిసారీ ఇలా ఇబ్బంది పెట్టడం దుర్మార్గపు చర్య అని చెప్పారు. గీతం వర్సిటీలో కంచె వేస్తే చుట్టుపక్కల బారికేడ్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అంబేద్కర్ జయంతి రోజున అప్రజాస్వామ్యం నడుస్తోందన్నారు. సామాన్యులను పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని.. వేరే మార్గంలో వెళ్లమంటే ప్రజలు ఎన్ని అవస్థలు పడతారో అర్థం చేసుకోవాలన్నారు.




దిల్లీ: వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేది లేదని కేంద్రం స్పష్టంచేసింది. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను నిలుపుదల చేసినట్లు వస్తున్న వార్తలను కేంద్రం ఖండించింది. స్టీల్‌ప్లాంట్‌లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టంచేసింది. స్టీల్‌ప్లాంట్ పనితీరు మెరుగుకు ప్రభుత్వం, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ తన వంతు కృషి చేస్తున్నాయంటూ ఈ మేరకు ఉక్కు మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో స్పష్టంచేసింది. ఇప్పటికిప్పుడు స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం చేయాలని కేంద్రం అనుకోవడం లేదని, ప్లాంటును బలోపేతం చేసే ప్రయత్నాలు చేస్తున్నామంటూ కేంద్రమంత్రి ఫగ్గన్ సింగ్ గురువారం చేసిన వ్యాఖ్యలు ఇందుకు నేపథ్యం. ప్రైవేటీకరణపై కేంద్రం ముందుకు వెళ్లడం లేదని, ప్రస్తుతం పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు ప్లాంటు పనిచేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ విషయంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాలతో ప్రత్యేకంగా చర్చిస్తామని తెలిపారు. అయితే ఆ తర్వాత కార్మికులు, తదితరులతో జరిగిన భేటీల్లో ఆయన ఈ విషయంపై విస్పష్టమైన ప్రకటన చేయలేదు. దీంతో రకరకాల చర్చలకు తెరలేచింది. మంత్రి ప్రకటనతో ప్రైవేటీకరణ ఉంటుందా? ఉండదా? అనేదానిపై స్పష్టత కొరవడింది. ఈ క్రమంలోనే ప్రైవేటీకరణ అంశంపై కేంద్రం తాజాగా స్పష్టతనిచ్చింది.

# తనకు బ్రేకిచ్చిన సంస్థకే కళ్లు భైర్లు కమ్మేలా..!

కోటి పారితోషికం అన్న పదం వినేందుకే ఎంతో బరువుగా ఉంటుంది. మెగాస్టార్ చిరంజీవి కోటి పారితోషికం అందుకునేందుకు దశాబ్దం పైగానే హీరోగా అలుపెరగకుండా శ్రమించాల్సొచ్చింది. కానీ ఇప్పటితరం కథానాయికలు ఇలా నాలుగైదేళ్లలోనే అవలీలగా కోటి పారితోషికం అందుకుంటున్నారు. కోటి అంటే ఖాతరు చేసే పరిస్థితి లేదు ఇప్పుడు. ఇక పరిశ్రమకు పరిచయమైన నాలుగేళ్లకే కోటి పైగా పారితోషికం అందుకుంటున్న రష్మిక మందన వరుస బ్లాక్ బస్టర్లతో లక్కీ ఛామ్ గా మారడంతో ఇక తన డిమాండ్లకు హద్దు అన్నదే లేకుండా పోయిందని టాక్ వినిపిస్తోంది. ఇటీవలి పుష్ప - ది రైజ్ తెలుగు-హిందీలో బ్లాక్ బస్టర్ కొట్టడంతో రష్మిక తన రేంజును అమాంతం పెంచేసిందన్న టాక్ వినిపిస్తోంది. ఇప్పుడు ముంబై పరిశ్రమలో వరుసగా మూడు నాలుగు చిత్రాలు చేస్తోంది. మరోవైపు టాలీవుడ్ అగ్ర హీరోలందరితోనూ సినిమాలు చేసేస్తోంది. అందుకే ఇప్పుడు దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో ఉంది. ఇప్పటికిప్పుడు ఎవరైనా తెలుగు నిర్మాత కనిపిస్తే రూ. 2కోట్ల



పారితోషికం డిమాండ్ చేస్తోందట. ఆ ఫిగర్ వినగానే నిర్మాత నీళ్లు నములుతున్నాడని తెలుస్తోంది. రష్మిక మందన్న తన రెమ్యునరేషన్ ని అమాంతం పెంచేసింది. లక్షల్లో అందుకునే ఈ బ్యూటీ ఉన్నట్టుండి కోటికి ఎగబాకి ఇప్పుడు ఏకంగ 2కోట్లు అడిగేస్తోంది. పుష్ప సక్సెస్ కిక్కు ఇది! అంటూ గుసగుసలు వైరల్ గా స్ప్రెడ్ అవుతున్నాయి. ఇప్పటికే పుష్ప సీక్వెల్ కోసం 2కోట్ల రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందట. ఇతర నిర్మాతల నుండి కూడా అదే ఆశిస్తోందట. ప్రఖ్యాత గీతా ఆర్ట్స్ నాయికా ప్రధాన చిత్రానికి సన్నాహాలు చేస్తూ రష్మికను సంప్రదించగా.. భారీ పారితోషికం అడిగిందని తెలిసింది. నిజానికి గీత గోవిందం తో తన రేంజును పెంచింది గీతా సంస్థనే. అయినా కానీ పారితోషికంలో రూపాయి తగ్గేదే లేదని చెబుతోందట. నిర్మాతల నుంచి జీఎస్టీతో పాటు రూ. 2 కోట్లు అడిగినట్లు సమాచారం. ఈ చిత్రానికి చిలసౌ-మన్మధుడు 2 చిత్రాలకు దర్శకత్వం వహించిన రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఇప్పటికి ఇంకా రష్మిక ఈ మూవీకి సంతకం చేయలేదు. పుష్ప 2 తర్వాత ఏ సినిమా చేస్తోందో వివరాల్ని వెల్లడించలేదు. అటు హిందీ కమిట్ మెంట్లు పూర్తయితే కానీ ఏదీ చెప్పలేని స్థితిలో ఉందనుకోవాలి. బిగ్ బ్రేకిచ్చిన సంస్థకే కళ్లు భైర్లు కమ్మే ట్రీట్ ఇస్తోంది ప్రస్తుతానికి.

## అతిగా ఆశపడదు.. కానీ పీకేతో మేఘా ఆకాష్ డ్రీమ్!

చెన్నై సోయగం మేఘా ఆకాష్ టాలీవుడ్ కి సుపరిచితమే.'లై 'సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ అటుపై 'ఛల్ మోహన్ రంగ'.. 'రాజ రాజ చోర'.. 'డియర్ మేఘ' లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఇవేవి అమ్మడికి కలిసి రాలేదు. టాలీవుడ్ లో పెద్ద హీరోయిన్ అవ్వాలని లాంచ్ అయింది గానీ..అమ్మడి డ్రీమ్ మాత్రం నెరవేరలేదు. ఈ గ్యాప్ లో తమిళ..హిందీ భాషల్లోనూ సినిమాలు చేసింది. కానీ అమ్మడికి 2023 ఇయర్ మాత్రం బాగానే కలిసిసొచ్చినట్లు కనిపిస్తుంది. ప్రస్తుతం మేఘా ఆకాష్ చేతిలో ఐదారు సినిమాలు కనిపిస్తున్నాయి. ఐదారేళ్ల కెరీర్ లో ఏనాడు బ్యాక్ టూ బ్యాక్ ఇన్ని సినిమాలు చేయలేదు. మరి ఈ ఏడాదైనా బ్యూటీకి కలిసొస్తుందేమో చూడాలి. రవితేజ తో రొమాన్స్ చేసిన 'రావణాసుర' రిలీజ్ అవుతుంది. ఇది అమ్మడికి మరో బిగ్ ఆఫర్. ఫెయిల్యూర్స్ ఉన్నా? తనలో యూనిక్ క్వాలిటీని



చూసి దర్శకుడు సుధీర్ వర్మ అమ్మడికి సినిమాలో అవకాశం కల్పించారు. ఈ సినిమా రిలీజ్ నేపథ్యంలో కెరీర్ ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ' నటిగా నా ప్రయాణం పట్ల...నాకు దక్కిన గుర్తింపు పట్ల పూర్తి సంతోషంగా ఉన్నాను. అతిగా ఆశించనడం నాకు నచ్చదు. కానీ పవన్ కళ్యాణ్ గారితో ఒక్క సినిమా అయినా చేయాలన్నది నా డ్రీమ్. అదెప్పుడు నెరవేరుతుందో చూడాలి. నేను ఇష్టపడతే వాతావరణంలో నాకే నచ్చిన పాత్రలతో ప్రయాణాన్ని ఆస్వాదిస్తా. ఒకేసారి మూడు..నాలుగు పాత్రలు చేయాలని ఆరాపడిపోను. ఏమాత్రం విరామం దొరికినా కుటుంబంతోనే సమయాన్ని గడుపుతా. స్నేహితులు చాలా మంది ఉన్నారు. కానీ వాళ్లకి ఇచ్చే సమయం చాలా తక్కువ. అలాగే నేను నటించిన సినిమా ఏదైనా ఒక్కసారే చూస్తా. తర్వాత వాటి గురించి ఆలోచించను.. విశ్లేషణలాంటివి అస్సలు ఉండవు. సెట్లో ఉన్నప్పుడు మానిటర్ లో చూడను. బాగా చేసానా? లేదా? అని దర్శకుడిని అడిగి వదిలేస్తా. ఆయన మాట ఫైనల్ కాబట్టి. అక్కడ అంతకు మించి నటులు చేయాల్సింది ఏమీ ఉండదు' అని అన్నారు.




# తమన్నా బికినీ అందాలు.. మైండ్ బ్లోయింగ్!



అందంతో ఒంపుసొంపులతో తక్కువ సమయంలోనే మంచి క్రేజ్ సంపాదించుకుంది మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. సూపర్ స్ట్రక్చర్ కళ్లు చెదిరే అందం శిల్పి చెక్కినట్లుగా ఒంపులు తిరిగిన శరీరంతో కుర్రాళ్లలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న బ్యూటీ తమన్నా. ఈ బ్యూటీ ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో తన అందచందాలతో రచ్చ లేపుతోంది. గ్లామర్ షోలో ఏమాత్రం తగ్గడం లేదు. చిట్టి పొట్టి డ్రెస్సులతో థైస్ షో డీప్ లోనెక్ లో ఎద ఎత్తులతో కుర్రాకారును కవ్విస్తోంది. ఈ స్టార్ హీరోయిన్ అందాల ఆరబోతతో కుర్రాళు పిచ్చెక్కిపోతున్నారు. తాజాగా ఈ బ్యూటీ పిక్స్ సోషల్ మీడియోలో వైరల్ గా మారాయి. ట్రావెల్ అండ్ లీజర్ ఇండియా సంస్థ కోసం తమన్నా ఫోటో షూట్లో పాల్గొంది. సింగపూర్ లోని సెంటోసాలో అదిరిపోయే లుక్స్ తో దర్శనమిచ్చింది. చేతిలో సర్ఫ్ బోర్డు పట్టుకుని అలా నీటిలో నుండి నడుస్తూ ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ పిక్స్ లో తమన్నా అచ్చం జలకన్యలాంటి అందంతో మైమరిపిస్తోంది. మల్టీ కలర్ ఔట్ ఫిట్ నుండి థైస్ అందాలు కుర్రాళ్లను పిచ్చెక్కిస్తున్నాయి. క్లీవేజ్ షోతో అల్లాడించేస్తున్నాయి. అలా నీటిలో నడిచి వస్తూ తన ఒంపు సొంపులను ప్రదర్శిస్తూ తన ఫాలోవర్స్ ను ఆగమాగం చేసేస్తోంది ఈ హాట్ బ్యూటీ. ట్రావెల్ అండ్ లీజర్ ఇండియా సంస్థ తమన్నాను తమ కవర్ స్టార్ గా పేర్కొంది. ఈ గ్లామరస్ బ్యూటీతో ఈ సంస్థ తమ సేవలను ప్రచారం చేస్తోంది. ఇక ప్రస్తుతం తమన్నా చేతిలో ఒకటీ అర సినిమాలు తప్ప పెద్దగా అవకాశాలు రావడం లేదు. ప్రస్తుతం తెలుగులో భోళా శంకర్ సినిమాలో చిరు సరసన నటిస్తోంది. హిందీలో పలు వెబ్ సిరీస్ లు చేస్తున్నట్లు సమాచారం. తమిళంలో సూపర్ స్టార్ రజినీ కాంత్ జైలర్ సినిమాలో కూడా తమన్నాకు ఛాన్స్ వచ్చింది. తెలుగులో రీసెంట్ గా సత్యదేవ్ తో కలిసి గుర్తుందా శీతాకాలం సినిమా చేసిన తమన్నా.. ఆ తర్వాత వేరే ప్రాజెక్టులు ఒప్పుకున్నట్లు లేదు.

# కుమారి మళ్లీ బోల్డ్ అటెంప్ట్ తో బరిలోకి?



ముంబై బ్యూటీ హెబ్బా పటేల్ టాలీవుడ్ కి ఉవ్వెత్తున దూసుకొచ్చి ఒక్కసారిగా చల్లబడింది. కుమారి 21 ఎఫ్‌లో బోల్డ్ అటెంప్ట్ తో యూత్ లో క్రేజీ భామగా మారిపోయింది. ఆ సక్సెస్ హెబ్బాకి మంచి ఐడెంటిటీని తెచ్చిపెట్టింది. అంతకు ముందు అలా ఎలా చిత్రం తో డీసెంట్ హిట్ వేసుకుంది. ఈ రెండు సక్సెస్ లు బ్యూటీకి టాలీవుడ్ లో పూల బాటనే వేసాయి. మీడియం రేంజ్ హీరోల సరసన బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేసింది. దాదాపు ఐదేళ్ల పాటు బిజీగానే కొనసాగింది. అయితే స్టార్స్ చిత్రంలో మాత్రం అవకాశం రాలేదు. ఈ క్రమంలో ఐటం భామగానూ లక్ ని చెక్ చేసుకుంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ హీరోగా నటించిన రెడ్ సినిమాలో ఓ ఐటం పాటలో నర్తించింది. కుమారి తర్వాత మరోసారి ఐటం పాటలో అందాల ఆరబోతలో తక్కువేం! కాదని నిరూపించింది. కానీ రెడ్ పరాజయంతో ఆ ఎ ఫెర్ట్ అంతా వృద్ధా అయింది. ప్రస్తుతం రెండు మూడు సినిమాలు చేస్తోంది. కానీ ఆవేమి ప్రచారంలో లేని చిత్రాలు. తాజాగా హెబ్బా పటేల్ మరో బోల్డ్ అటెంప్డ్ కి రెడీ అయిందని గుసగుస వినిపిస్తోంది. ఓ రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్ అందాల వడ్డనకు రెడీ అయిందని క్లోజ్ సోర్సెస్ చెబుతున్నాయి. అదే నిజమైతే హెబ్బా మళ్లీ ట్రాక్ లోకి వస్తున్నట్లే. అయితే ఇక్కడ బ్యానర్..దర్శకుడు ఎవరు? అన్నది చాలా కీలకం. బోల్డ్ గా ఎలాంటి ప్రయత్నాలు చేసినా పేరున్న బ్యానర్లో అయితేనే ఫేమస్ అయ్యేది. ఇలాంటి సస్పెన్స్ థ్రిల్లర్ లో నటించడం హెబ్బాకి ఇదే తొలిసారి. అయితే ఈ సినిమాపై కుమారి చాలా ఆశలే పెట్టుకుందని వినిపిస్తోంది. ఈ సినిమాతో ఎలాగైననా మళ్లీ లైమ్ లైట్ లోకి రావాలని ఆశపడుతోంది. హెబ్బా కెరీర్ లో సక్సెస్ ల పరంగా చూసుకుంటే కుమారి 21 ఎఫ్ నాన్న నేను బోయ్ ఫ్రెండ్ మినహా చిత్రాలు బాక్సాఫీస్ పెద్దగా రాణించలేదు ఈ రెండు చిత్రాల్లో కూడా హెబ్బా తన మార్క్ వేసింది. గ్లామర్ డోస్ పెంచి చేసిన రెండు చిత్రాలివి. ఆ తర్వాత గ్యాప్ లేకుండా సినిమాలైతే చేసిందిగానీ..కెరీర్ ని బిల్డ్ చేసుకోవడానికి ఆ సినిమాలేవి పెద్దగా ఉపయోగపడలేదు. ఈ నేపథ్యంలో బోల్డ్ అటెంప్ట్ ని నమ్ముకుని మరోసారి బరిలోకి దిగుతున్నట్లు సమాచారం. బోల్డ్ అటెంప్డ్ ని సక్సెస్ మంత్రంగా జపించి ప్రాజెక్ట్ కి కమిట్ అయినట్లు తెలుస్తోంది. మరి ఆ సెంటిమెంట్ రిపీట్ అవుతుందా? లేదా? అన్నది అమ్మడి లక్ ఫ్యాక్టర్ పై ఆధారపడి ఉంటుంది. ఇక సినిమాల లైనప్ పరంగా చూసుకుంటే గీత అనే చిత్రం షూటింగ్ పూర్తిచేసింది. ఒడెలా రైల్వే స్టేషన్ తెలిసిన వాళ్లు అనే మరో రెండు చిత్రాల్లో నటిస్తోంది. ఈ మూడు కాక కొత్త అవకాశంతో మొత్తంగా నాలుగు సినిమాలు బ్యూటీ ఖాతాలో ఉన్నట్లు.

# ఆయనలోని ఆ తపనే నాకు నచ్చుతుంది: జాక్వెలిన్

బాలీవుడ్ బ్యూటీలలో జాక్వెలిన్ కి ప్రత్యేకమైన స్థానం ఉంది. మిగతా కథానాయికలకు భిన్నంగా ఆమె బాడీ లాంగ్వే జ్ ఉంటుంది. తన బాడీ లాంగ్వేజ్ కి తగిన పాత్రలను మాత్రమే ఆమె అంగీకరిస్తూ ఉంటుంది. ఈ శ్రీలంక బ్యూటీ జాన్ అబ్రహంతో కలిసి తెరపై బాగానే సందడి చేసింది. గతంలో 'రేస్ 2' .. ' డిష్యూమ్' వంటి సినిమాలలో అలరించిన ఈ జంట ఇప్పుడు 'ఎటాక్ పార్టు 1'తో ప్రేక్ షాకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నారు. లక్ష్య రాజ్ ఆనంద్ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. 'ఏక్ థా టైగర్' .. 'బ్యాంగ్ బ్యాంగ్' వంటి సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ గా .. 'రాకెట్ సింగ్' సినిమాకి దర్శకత్వం వహించిన లక్ష్యరాజ్ ఆనంద్ ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. యాక్షన్ .. యాక్షన్ కామెడీ సినిమాలకు కేరాఫ్ అడ్రెస్ గా చెప్పుకునే జాన్ అబ్రహం ఈ సినిమాలోను తనదైన మార్క్ చూపించే పాత్రలో కనిపించనున్నాడు. జయంతిలాల్ గడ - అజయ్ కపూర్ నిర్మించిన ఈ సినిమాకి జాన్



అబ్రహం కూడా ఒక నిర్మాతగా వ్యవహరించాడు. ప్రకాశ్ రాజ్ .. రకుల్ ప్రీత్ సింగ్ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమాను 1వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ జోరందుకున్నాయి. బాలీవుడ్ లో ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ సినిమా టీమ్ కనిపిస్తోంది. తాజా ఇంటర్వ్యూలో జాక్వెలిన్ మాట్లాడుతూ .. "ఈ కథ చాలా కొత్తగా ఉంటుంది. సైన్స్ ఫిక్షన్ తో ముడిపడిన ఒక సూపర్ సోల్జర్ సినిమా ఇది. ఈ కథ చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఇలాంటి ఒక సినిమాలో అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. జాన్ అబ్రహంతో కలిసి నటించడం ఎంతో సంతోషంగా .. సరదాగా ఉంటుంది. తన ప్రతి సినిమా విషయంలో ఆయన ఎంతగా కష్టపడతారనేది ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అలాగే ఈ సినిమా విషయంలోను ఆయన ఎంతగా కష్టపడ్డాడనేది నేను ప్రత్యక్షంగా చూశాను. తన పాత్రకి న్యాయం చేయడం కోసం ఆయన పడే తపన నాకు ఎంతో నచ్చుతుంది.

ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం నాకు ఉంది" అంటూ చెప్పుకొచ్చింది. ఇక కొంతకాలంగా బాలీవుడ్ లో నిలదొక్కుకోవడానికి రకుల్ గట్టిగానే ప్రయత్నాలు చేస్తోంది. ఈ సినిమా హిట్ ఆమెకి మరింత అవసరం. అందువలన ఆమె కూడా ఈ సినిమా రిలీజ్ కోసం వేయి కళ్లతో వెయిట్ చేస్తోంది.

## ఇలా షాక్ ఇస్తే ఎలా సీతగారు.. మరో బికినీ డోస్

సీతారామం చిత్రంతో తెలుగు సినీ ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది హీరోయిన్ మృణాల్ ఠాకూర్. అందం అభినయంతో అందరినీ కట్టి పడేసింది. సీతారామం సినిమాలో నూర్జహాన్ పాత్రకు ప్రాణం పోసి.. అందరి మనసుల్లో సీతగా నిలిచిపోయింది. సంప్రదాయ పద్ధతిలో చక్కనైన చీర కట్టులో మెరిసిన ఈ బాలీవుడ్ బ్యూటీ.. పొట్టి పొట్టి గౌనుల్లో కూడా ట్రెండీగా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే ఈ అమ్మడు తనకు సంబంధించిన సినిమా అప్ డేట్లతో పాటు ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. అయితే తాజాగా ఈమెకు సంబంధించిన ఓ ఫొటో నెట్టింట వైరల్ గా మారింది. అందులో బికినీ వేసుకొని రచ్చ చేస్తోంది. స్లీవ్ లెస్ అండ్ డీప్ నెక్ ఉన్న ఓ టాప్ వేసుకున్న ఈమె... క్యూట్ గా చూస్తునే కుర్రకారు గుండెల్లో హీటు పుట్టిస్తోంది. అదిరిపోయే స్మైల్ ఇస్తూ అందిరినీ మెస్మరైజే చేసింది.



థైస్ అందాలన్నీ చాలా హైలెట్ చేస్తూ నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. పాంట్ వేసుకోవడం మర్చిపోయావా అని కొందరు.. అందాల ఆరబోతలో నిన్ను మించిన వారు లేరు హాటీ అంటూ మరికొంత మంది చెప్పుకొస్తున్నారు. మరికొందరేమో సీతారామం సినిమాలో సీతగా కనిపించింది నువ్వేనా అంటూ అడుగుతున్నారు. అప్పుడు అంత పద్ధతిగా కనిపించిన నువ్వు ఇంత హాట్ గా ఉంటావని అస్సలు అనుకోలేదంటూ తమ మనసులోని భావాలను వెల్లడిస్తున్నారు. చీరలో నీ అందం అమాయకత్వం అందరికీ నచ్చాయని నెటిజన్లు అంటున్నారు. కానీ ఇలా గ్లామర్ షో చేయడం నీ ఫ్యాన్స్ గా మాకు నచ్చట్లేదని మరికొంత మంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరి తన అభిమానులపై ఈ బాలీవుడ్ బ్యూటీ ఎలా స్పందించనుందో తెలియాలంటే ఇంకా కొంత కాలం ఆగాల్సిందే. 2014లో మరాఠీ సినిమా విట్టి దండుతో సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ బ్యూటీ.. ప్రస్తుతం వరుస ఆఫర్లతో దూసుకెళ్తోంది. సీతారామం సినిమా తర్వాత ఆమె అరడజనుకు పైగా సినిమాల్లో ఛాన్స్ కొట్టేసిందంటూ వార్తలు వచ్చాయి. ఇదే నిజమైతే ఆమె త్వరలోనే టాప్ స్టార్ హీరోయిన్ గా పేరు దక్కించుకోవడం ఖాయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీతారామం సినిమా తర్వాత పారితోషికం విషయంలో కూడా ఈ బాలీవుడ్ బ్యూటీ ఏమాత్రం వెనక్కు తగ్గట్లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి.



# ఘనంగా అంబేడ్కర్ విగ్రహావిష్కరణ.. పాల్గొన్న సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేడ్కర్

హైదరాబాద్: నగరం నడిబొడ్డున భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెలికాప్టర్ ద్వారా విగ్రహంపై పూల వర్షం కురిపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అంబేడ్కర్ మనువడు ప్రకాశ్ అంబేడ్కర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. విగ్రహావిష్కరణకు ముందు బౌద్ధ గురువులు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు, భారాస కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహ రూపకల్పనపై రూపొందించిన డాక్యుమెంటరీని సీఎం కేసీఆర్, ప్రకాశ్ అంబేడ్కర్, ముఖ్య నేతలు తిలకించారు. అంబేడ్కర్ జీవిత విశేషాల ఫొటో ఎగ్జిబిషన్‌ను కూడా వీక్షించారు.

**విగ్రహ విశేషాలివే..** దేశంలో ఇప్పటివరకూ ఉన్న అంబేడ్కర్ విగ్రహాల్లోకెల్లా ఎత్తయినదిగా హైదరాబాద్‌లో నిర్మించిన ఈ స్మారకం ఖ్యాతి గడించింది. పార్లమెంటు ఆకారంలో 50 అడుగుల పీఠం, ఆపైన 125 అడుగుల నిలువెత్తు లోహ విగ్రహం ఇది. పీఠం లోపల మ్యూజియం, గ్యాలరీ, ఆడియో విజువల్ గది కూడా ఏర్పాటు చేశారు. రూ.146.50 కోట్ల అంచనా వ్యయంతో విగ్రహ ఏర్పాటుకు ఏప్రిల్ 14, 2016లో శంకుస్థాపన జరగ్గా.. అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా నేడు విగ్రహావిష్కరణ జరిగింది. హుస్సేన్‌సాగర్ తీరంలో ఎన్టీఆర్ గార్డెన్‌ను ఆనుకుని దాదాపు 11.80 ఎకరాల స్థలంలో విగ్రహాన్ని నిర్మించారు. విగ్రహ తయారీకి 360 మెట్రిక్ టన్నుల ఉక్కు, 114 టన్నుల లోహంతో విగ్రహాన్ని తయారు చేశారు. విగ్రహం చుట్టూ 2.93 ఎకరాల్లో ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ ఏర్పాటు చేశారు.



# ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసిన ప్రకాశ్ అంబేడ్కర్

**ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ అంబేడ్కర్ మనువడు ప్రకాశ్ అంబేడ్కర్ కలిశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ అంబేడ్కర్‌ను కేసీఆర్ సాదరంగా ఆహ్వానించారు. సీఎం కేసీఆర్‌తో కలిసి ప్రకాశ్ అంబేడ్కర్ భోజనం చేశారు. అనంతరం విగ్రహావిష్కరణ కోసం ప్రగతి భవన్ నుంచి కాన్వాయ్‌లో బయలుదేరారు.**

# అంబేడ్కర్ స్ఫూర్తితో తెలంగాణలో పాలన : మంత్రి తలసాని

హైదరాబాద్ : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణలో పాలన సాగుతుందని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్ పేట డివిజన్ వెంగళ్‌రావు నగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను మంత్రి ఆవిష్కరించి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలకు గుర్తింపుగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో 125 అడుగుల నిలువెత్తు విగ్రహాన్ని నిర్మించడం చారిత్రాత్మకమని అన్నారు. అంటరానితనం, కుల నిర్మూలనే లక్ష్యంగా పోరాడిన మహనీయుడు డాక్టర్ బీఆర్అంబేడ్కర్ అని అన్నారు. రాజ్యాంగ రూపకర్తగా, న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా అనేక రంగాల్లో సేవలు అందించారని స్మరించుకున్నారు. అంబేడ్కర్ సేవలను ప్రపంచం మొత్తం గౌరవిస్తుందని చెప్పారు. దళితులకు నిజమైన ఆత్మ బంధువు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. దళిత బంధు క్రింద ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. మొదటి విడతలో నియోజకవర్గానికి



వందమంది చొప్పున ఆర్థిక సహాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రెండో విడత ఆర్థిక సహాయం త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, రాంగోపాల్ పేట మాజీ కార్పొరేటర్ లు అత్తిలి అరుణ గౌడ్, మల్లిఖార్జున్ గౌడ్, వెంగళ్ రావు నగర్ అధ్యక్షుడు బాల మల్లేష్, నర్సింగ్ రావు, రాజు, గాలయ్య, ఎల్లయ్య, సాయిలు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



# 'అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ వ్యతిరేకం కాదు.. పక్కా స్వాగతిస్తాం'

హైదరాబాద్: అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ వ్యతిరేకం కాదని.. పక్కా స్వాగతిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ స్పష్టం చేశారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ 132వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు భాషా, బంగారు శృతి, మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్, చింతా సాంబమూర్తి తదితరులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. దళితద్రోహి కేసీఆర్‌కు అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించే అర్హత లేదన్నారు. దళిత సమాజానికి క్షమాపణ చెప్పిన తర్వాతనే కేసీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముట్టుకోవాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మార్చాలన్న కేసీఆర్ దళితులను అన్ని విధాలా మోసం చేశారని విమర్శించారు. బీజేపీ ఒత్తిడి వలనే నిలిచిన అంబేడ్కర్ విగ్రహం పనులను ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని ఆయన చెప్పుకొచ్చారు.

# హైదరాబాద్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన

హైదరాబాద్: హైదరాబాద్‌లో అక్కడక్కడ వర్షం కురుస్తున్నది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి నగరంలో ఉరుములు, మెరుపులు వస్తున్నాయి. దీనికి వర్షం కూడా తోడయింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకపూల్, నాంపల్లి, చందానగర్, మియాపూర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, హైదర్‌నగర్, నిజాంపేట్, జగద్గిరిగుట్ట, జేఎన్‌టీయూ, ప్రగతినగర్, మూసాపేట్, కుత్బుల్లాపూర్, సూరారం, జీడిమెట్ల, చింతల్, బాలానగర్, కొంపల్లి, సుచిత్ర, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, మాదాపూర్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురుస్తున్నది. అయితే జీహెచ్‌ఎంసీ సిబ్బంది రోడ్లపై నీళ్లు నిలువకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వచ్చిన నీటిని వచ్చినట్లే వెళ్లిపోయేలా చూస్తున్నారు. దంచికొడుతున్న ఎండలతో పెరిగిన ఉష్ణోగ్రతల నుంచి వర్షాల వల్ల ప్రజలకు కాస్త ఉపశమనం లభించినట్లయింది. గురువారం సాయంత్రం కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. జగద్గిరిగుట్ట, చింతల్, బాలానగర్, చంపాపేట్, సరూర్‌నగర్,



చైతన్యపురిలో వానపడింది. సైదాబాద్ పరిసర ప్రాంతాల్లో వడగళ్లతో వర్షం కురవగా.. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట, చిలకలగూడ, మారేడుపల్లితో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. అలాగే పలుప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షం కురిసింది.



# పంజాగుట్టలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

**హైదరాబాద్: హైదరాబాద్‌లోని పంజాగుట్ట చౌరస్తాలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ మేయర్ విజయ లక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జై భీమ్.. జై కేసీఆర్ నినాదాలతో పంజాగుట్ట కూడలి మారుమోగింది.**

# స్వేచ్ఛ, సమానత్వమే అంబేడ్కర్ జీవిత సూత్రాలు: మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్: స్వేచ్ఛ, సమానత్వాన్ని జీవిత సూత్రాలుగా అంటరానితనానికి వ్యతిరేకంగా అంబేడ్కర్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్ బండ్ వద్ద రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని, కుల, మత రహిత ఆధునిక భారతదేశం కోసం అంబేడ్కర్ తన జీవితకాలం పోరాటం చేశారన్నారు.

దళితుల పట్ల నాడు ఉన్న వివక్షను రూపుమాపేందుకు ఆయన చేసిన పోరాటం మరువలేనిదని తెలిపారు. ఆయన ఖ్యాతిని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో 125 అడుగుల భారీ



విగ్రహాన్ని ఆవిష్కరించనుందని, ఇది దేశంలోని అతి ఎత్తయిన స్మారక చిహ్నంగా నిలవనుందని పేర్కొన్నారు

# 'అది అంబేడ్కర్ విగ్రహం కాదు విప్లవ రూపం'

సిద్దిపేట జిల్లా: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి హరీష్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ముందు చూపు వల్ల దేశంలో అన్ని రంగాల్లో ముందుకెళ్తున్నామన్నారు. దళితుల గిరిజనుల కోసం ముఖ్యమంత్రి ఎన్నో పథకాలు తెచ్చారని తెలిపారు. అన్ని గురుకుల పాఠశాలలను పదవ తరగతి నుంచి ఇంటర్ మీడియాట్ వరకు పొడిగించారన్నారు.

ఈ జాతి అభివృద్ధి కోసం దళితబంధు తెచ్చి కేసీఆర్ సహోసోపేతమైన నిర్ణయం తీసుకున్నారన్నారు. అంబేడ్కర్ ఓవరసీస్ స్కాలర్ షిప్ ప్రారంభించారని తెలిపారు. విద్య చాలా ముఖ్యమైనదని అందుకే.. వెయ్యికిపైగా గురుకులాలను సీఎం ప్రారంభించారన్నారు. నేడు దేశంలోనే అతి పెద్ద 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ప్రారంభిస్తున్నామన్నారు. సచివాలయంలో నుంచి చూస్తే ఒకవైపు అమరవీరుల స్థూపం, మరోవైపు అంబేడ్కర్ విగ్రహం కనబడుతుందన్నారు. అది అంబేడ్కర్ విగ్రహం కాదు విప్లవ రూపమని చెప్పుకొచ్చారు. అంబేడ్కర్ విగ్రహం ఆకారానికి ప్రతీక కాదు తెలంగాణ



ప్రజల చైతన్య దీపిక అని అన్నారు. ఇంకా దళితులకు జరగవలసినది చాలా ఉందన్నారు. ఆర్థిక సమానత్వం వచ్చినపుడు అస్పృశ్యతను తొలనాడుతామన్నారు. దళిత, గిరిజనుల అభ్యున్నతి కోసం తప్పకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్నామన్నారు. దేశమంతా హైదరాబాద్ వైపు చూస్తున్నారని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రోజా శర్మ, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం ఎందుకు మార్చాలో సీఎం కేసీఆర్ చెప్పాలి..




హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆమె ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు దగ్గరకు వచ్చాక అంబేడ్కర్ విగ్రహం వచ్చిందని, తెలంగాణలో కేసీఆర్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. రాజ్యాంగం ఎందుకు మార్చాలో సీఎం కేసీఆర్ చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కుటుంబంలో ఐదు ఉద్యోగాలు ఉన్నాయని విమర్శించారు. విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులపై ప్రేమ ఉన్నట్టు కాదన్నారు. సీఎం కేసీఆర్ రాజ్యాంగంలో ప్రజలకు హక్కులు లేవని, ఆయన రాజ్యాంగాన్ని అవమాన పరిచారని షర్మిల అన్నారు. బీఆర్ఎస్ రాజ్యాంగంలో ప్రతిపక్షాలకు కొట్లాడే హక్కు లేదని, దళితులను అన్ని రకాలుగా సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ ఒక ఆఫ్ఘనిస్తాన్ అని, సీఎం ఒక తాలిబాన్ నేతని అన్నారు. అసలు తెలంగాణలో రాజ్యాంగం ఉందా? అని ప్రశ్నించారు. ఇండియన్ రాజ్యాంగాన్ని తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలకు కొట్లాడే స్పేస్ ఇవ్వాలన్నారు. కేసీఆర్ అంబేడ్కర్ వారసుడని అంటున్నారని.. దీనికంటే పెద్ద జోక్ ఇంకొకటిలేదన్నారు. దళితులను జైల్లో చిత్రహింసలు పెట్టి చంపుతున్నారని, అన్ని పాలసీలకు దళితుల భూమి దోచుకుంటున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ వారసుడనని చెప్పుకోవడానికి ముఖ్యమంత్రికి సిగ్గు ఉండాలని షర్మిల వ్యాఖ్యానించారు.

# 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించుకోవడం గర్వకారణం : ఎమ్మెల్సీ కవిత

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ట్వీట్ చేశారు. ఆధునిక భారతానికి మార్గదర్శి, ప్రపంచంలోనే గొప్పదైన భారత రాజ్యాంగ రూపకర్త, సామాజిక అసమానతలను రూపుమాపడానికి జీవితాంతం కృషి చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి మా నమస్సుమాంజలి అని కవిత పేర్కొన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో దళిత, గిరిజన, బహుజన, మైనారిటీ వర్గాలకు.. విద్య, వైద్యం, ఉపాధితో పాటు సామాజికంగా ఉన్నత స్థితికి చేర్చేందుకు అనేక మహోన్నత కార్యక్రమాలు అమలవుతున్నాయి. హైదరాబాద్‌లో దేశంలోనే ఎత్తయిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నేడు ఆవిష్కరించుకోవడం చారిత్రాత్మకం, గర్వకారణం అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు.




# దళితుల అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన అంబేడ్కర్: మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హైదరాబాద్: దళితుల అభ్యున్నతికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిరంతరం కృషి చేశారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. అంటరానితనం, కుల నిర్మూలనే లక్ష్యంగా అనేక ఉద్యమాలు చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారని చెప్పారు. రాజ్యాంగ రూపకర్తగా, న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘ సంస్కర్తగా అన్ని రంగాల్లో సేవచేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఉండాలని మొదట పోరాటం చేసింది అంబేద్కరేనని చెప్పారు. తనలా మరెవరికీ అవమానం జరగొద్దని దేశ న్యాయ శాఖ మంత్రి అయ్యాక దళితులకు రిజర్వేషన్లను కల్పించారని గుర్తుచేశారు. మన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దదని, అలాంటి రాజ్యాంగాన్ని రాసి చరిత్రలో నిలిచిపోయారని వెల్లడించారు. ఆయన ఆధ్వర్యంలో రచించిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. అంబేడ్కర్ స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ నేతృత్వంలో పాలన సాగుతున్నదని చెప్పారు. దళితులకు నిజమైన ఆత్మబంధువు ముఖ్యమంత్రి కేసీఆర్ అని వెల్లడించారు. దళితుల బాగుకోసం దేశంలో ఎవరూ చేయలేని విధంగా దళిత బంధు పథకాన్ని అమలుచేస్తున్నారని తెలిపారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్దిదారుని అకౌంట్లలోనే పైసలు పడతాయన్నారు. వైన్‌షాపులు, మెడికల్ షాపులు, కెమికల్ దుకాణాలు, రైసు మిల్లుల వంటి వ్యాపారాలను ఏర్పాటు చేసుకునేందుకు లైసెన్సుల కోసం రిజర్వేషన్లు కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 17 లక్షల దళిత కుటుంబాలకు రూ.1.70 లక్షల కోట్లు కేటాయింపునకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com